366 రోజుల కొరకు ప్రత్యేక ప్రార్థనా అంశములు

GUIDELINES FOR PRAYERS

ప్రార్థనా మార్గదర్శిని



గోవాడ మోజెస్ బెన్ని

AN EVERYDAY PRAYER GUIDE

ప్రార్థనా మార్గదర్శిని

366 రోజుల కొరకు ప్రత్యేక ప్రార్థనా అంశములు

గోవాడ మోజెస్ బెన్నీ

Mobina
Publications

AN EVERY DAY PRAYER GUIDE

by

Rev. Moses Benny Govada

* ఈ పుస్తకంలో పొందుపరచిన అంశముల సమాచారము అంతా ఆగస్ట్ 2026 నాటికి ఇంటర్నెట్‌లో లభించిన వివరముల ఆధారముగా రూపొందించబడినది.

ముఖ్య గమనిక : ఈ పుస్తకంలో పొందుపరిచిన ప్రత్యేక దినాల ప్రార్థన అంశాలు 2027వ సంవత్సరపు క్యాలెండర్ ఆధారంగా రూపొందించబడ్డాయి. 2028 మరియు ఆ తర్వాతి సంవత్సరాలలో ఈ ప్రత్యేక దినాలు వచ్చే తేదీలలో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉంది. ఇవి ప్రతి ఏడాదీ ఒకే తేదీన కాకుండా, సుమారుగా అదే వారంలో (ఉదాహరణకు:ఆ నెల మొదటి ఆదివారం లేదా మొదటి సోమవారం) రావచ్చు. సంవత్సరాలు మారే కొద్దీ తేదీలలో వచ్చే ఈ మార్పులను దయతో గమనించవలసిందిగా పాఠకులను కోరుతున్నాము.

Copies available @

Rev. G. Moses Benny
BERACHAH BLESSING CHURCH
70-3-48/1a, Vidyanagar Road No.1,
Ramanayyapeta, KAKINADA - 533 005
Andhra Pradesh, INDIA.
Cell: +91 8985956799

Rs. **300/-**

Designed & Printed at :
SHARON OFFSET
KAKINADA - 533 004.
Cell: 9912022925



అంకితం ...

నాకు ప్రార్థన చేయడం

నేర్పించిన

నా తల్లిదండ్రులైన

బిషప్ రెవ. డా॥ జి. జోసఫ్ బెన్ని గారు

శ్రీమతి జి. వనజాక్షి బెన్ని గార్లకు

ఈ పుస్తకాన్ని అంకితమిస్తున్నాను.

విజ్ఞాపనకు విషయ సముదాయము

క్రైస్తవ విశ్వాస జీవితము ప్రార్థనతో ఆరంభము అవుతుంది, ప్రార్థనతోనే కొనసాగుతుంది. "తండ్రీ నా ఆత్మను నీకు అప్పగిస్తున్నాను" అనే ప్రార్థనతోనే ముగిస్తుంది అని వేరుగా చెప్పనవసరములేదు. దేవుని పిల్లలు ఏ విషయమైతే ఎక్కువగా మాట్లాడుతారో, ఆ విషయమై ఎంతో నిర్లక్షముగా ఉంటారని వెనుకటికి ఎవరో అన్నారు. ఇది సత్యమే అనిపిస్తుంది. ప్రార్థన అనే పదము పదే పదే పలికే క్రైస్తవ సమాజము ఎంత ప్రార్థిస్తుంది అనేది పెద్ద ప్రశ్నార్థకముగానే ఉన్నది. ప్రతికూల పరిస్థుతులు మనలను బాగా ఆందోళనకు నెట్టివేస్తున్న రోజులలో సంఘము ప్రార్ధనకు అప్పగించుకోవటము ఆరోగ్యకరమైన అనుభము గదా!

ప్రార్థనలు అనేక రకములుగా ఉన్నాయి. అవి వరుసగా వ్యక్తిగత, సామూహిక, కృతజ్ఞత, ఒప్పుకోలు, సమర్పణ, విలాప మరియు విజ్ఞాపన. ఈ ప్రార్థనలు అన్నియూ విశిష్టమైనవే. ఇందులో ప్రతీది ప్రాముఖ్యమైనదే. కాకపోతే ఇందులో విజ్ఞాపన ప్రార్థన బహు విశిష్టమైనది. విజ్ఞాపన ప్రార్థన అనగా మనలను గూర్చి మనము దేవుని వేడుకొనుట గాక ఇతరులను గూర్చి దేవునికి విన్నవించుకొనుట. ఇటువంటి ప్రార్ధనలు చేసినవారు లేఖనములలో చాలామంది మనకు తారసపడతారు. అబ్రహాము, మోషే, యేసు మరియు పౌలు వంటివారు ఈ వరుసకు చెందినవారు. ఇతరుల కొరకు విజ్ఞాపన చేసినవారు పిదప వారునూ ఆశీర్వదించబడ్డారు.

విజ్ఞాపన ప్రార్థనకు కావలిసినది సమాచారము. అబ్రహాము, మోషే మరియు నెహెమ్యాలు పరిశుద్ధ గ్రంథములో గొప్ప విజ్ఞాపనకర్తలు. వీరు సమాచారము లేకుండా విజ్ఞాపనలు చేయలేదు. సమాచారముతో వీరు చేసిన విజ్ఞాపనలు గొప్ప ఫలితాలు తెచ్చాయి అని మీకు వేరుగా చెప్పనక్కరలేదు. మనము కూడా ప్రార్థనలు చేయుటకు మనకునూ సమాచారము కావాలి. క్రైస్తవలోకమునకు ప్రార్థన సమాచారము అందించాలనే భారము దేవుని సేవకుడు మోజెస్ బెన్నీ గార్కి దేవుడు ఇవ్వడము గొప్ప విషయము. ఆ భారముతోనే ఈ పుస్తకము మీ చేతికి వచ్చిందని నేను నమ్ముతున్నాను.

క్రైస్తవ లోకమునకు అనుదిన ధ్యానాలు అలవాటుగా ఉంటుంది, గానీ అనుదిన ప్రార్థన సమాచారము అరుదె. ఈ పుస్తకము ద్వారా అనుదిన ధ్యానముతొ పాటు అనుదిన ప్రార్థనలు తొడైతె, ఆశీర్వదించబడి అనేకులకు ఆశీర్వాదముగా మారగలమని నమ్ముతూ, ఎంతో సమాచారమును సేకరించి పుస్తక రూపమున అందించిన మోజెస్ బెన్నీ గార్ని హృదయపూర్వకముగా అభినందిస్తూ.....

సహోదరుడు పి. ఎ. స్వామి

శ్రీకాకుళం.

పరిచయ వాక్కు

"మనము సంపూర్ణభక్తియు మాన్యతయు కలిగి, నెమ్మదిగాను సుఖముగాను బ్రతుకు నిమిత్తము,
అన్నిటికంటె ముఖ్యముగా మనుష్యులందరి కొరకును, రాజుల కొరకును,
అధికారులందరి కొరకును విజ్ఞాపనములును ప్రార్థనలును
యాచనలును కృతజ్ఞతాస్తుతులును చేయవలెనని హెచ్చరించుచున్నాను."
1 తిమోతి 2:1,2

ఈ వచనాన్ని పూర్తి స్థాయిలో నెరవేర్చే విధంగా చాలా సులభశైలిలో ఈ పుస్తకం మనందరికి సహకరిస్తుంది.

నాకత్యంత ప్రియులైన జి.జోసెఫ్ బెన్ని గారి కుమారుడుగా మాత్రమే గాక
దైవాసక్తి గల సేవకునిగా జి. మోజస్ గారు పరిశోధనాత్మకమైన ఈ **"ప్రార్థన మార్గదర్శిని"** పుస్తకం
ద్వారా మనందరికి ఎంతో సన్నిహితులైనందుకు హృదయపూర్వక శుభాభినందనలతో...

బ్రదర్ ప్రకాష్
సిద్ధిపేట.

అభినందన సందేశం

అన్ని విషయములలో సమృద్ధిగా ఉన్న ఈ దినములలో, అవసరత కనబడని కారణంగా ప్రార్థనా జీవితంలో అలసత్వం మరియు ప్రార్థన లోపం విశ్వాసులలోను, సంఘములోను కనిపించడం విచారకరం.

ఇలాంటి పరిస్థితిలో, ఈ పుస్తకములో పొందుపరచబడిన అనేక అంశముల కొరకు విశ్వాసులు క్రమబద్ధంగా ప్రార్థించుటకు సహాయపడే విధంగా రూపొందించబడిన **"ప్రార్థన మార్గదర్శిని"** ఎంతో అవసరమైనదిగా నేను భావిస్తున్నాను.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక ముఖ్యమైన ప్రార్థనా అంశములను ఎంతో శ్రమతో సేకరించి, వాటిని ఒకచోట చేర్చి ఈ గ్రంథాన్ని రూపొందించి ముద్రించిన గోవాడ మోజెస్ బెన్నీ గారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

ఈ **"ప్రార్థన మార్గదర్శిని"** అనేకమంది విశ్వాసులను మరింతగా ప్రార్థనలోనికి నడిపించి, సంఘములో ప్రార్థనా భారాన్ని పెంపొందించి, క్రైస్తవ లోకమంతటా ఒక గొప్ప ప్రార్థనా ఉజ్జీవనానికి దోహదపడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

- డా॥ పి. ఎమ్. హెన్రీ
ప్రెసిడెంట్, ఎఫ్.ఐ.జి.సి., కాకినాడ

విజయవంతమైన తొలిప్రయత్నం

సాహిత్య ప్రియులకు ప్రార్థనా వీరులకు ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీ అందరికీ సమృద్ధి అయిన ఆశీర్వాదములు కలుగును గాక !

ప్రార్ధన అనే శీర్షికపై అనేక పుస్తకాలు వెలువడ్డాయి. యవ్వనస్థుడైన జి.మోజెస్ బెన్నీ వ్రాసిన ఈ పుస్తకానికి పరిచయం వాక్కు వ్రాయడం నాకు ఆనందం. నా తోడి కోడలు వనజాక్షి గారు 18 సంవత్సరాల క్రితం చాలా తీవ్రమైన కాన్సర్ వ్యాధితో మరణపు అంచులోనికి వెళ్ళింది.అనేక మంది కన్నీటి ప్రార్ధనల ఫలితంగా దేవుడు ఆమెను ముట్టి స్వస్థపరచారు. నేటికి ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో సజీవ సాక్షిగా నిలిచి దేవుని మహిమ పరుస్తోంది.

మోజెస్ తండ్రి గారైన జి. జోసెఫ్ బెన్నీ గారు ఎన్నో అవరోధాలు దాటుతూ నేటికీ సంఘ కాపరిగా విశిష్టమైన సేవలందిస్తూ ఉన్నారు. వారి ఏకైక పుత్రుడు మోజెస్, దేవుడు తన తల్లిదండ్రులపట్ల చేసిన మేలులను బట్టి ఆయనకు కృతజ్ఞతతో ఈ తొలి ప్రయత్నం చేశాడు. ప్రార్థన భారంతో నింపబడిన తన జీవితాన్ని బట్టి నేను దేవున్ని స్తుతిస్తున్నాను.

ప్రార్ధన అంశముల మీద ఎన్నో పుస్తకాలు ఎంతోమంది కలం నుండి వెలువడ్డాయి. అయితే సంవత్సరానికి సరిపడా 366 ప్రార్ధన అంశాలను ఎన్నుకొని వాటిని ఒక సంపుటిగా మార్చడానికి విజయవంతమైన తొలి ప్రయత్నం చేసిన నా కుమారుడైన మోజెస్ బెన్నీని మనసారా అభినందిస్తున్నాను.

ఏం ప్రార్థించాలో తెలియక ఎప్పుడు ఒకే విధమైన అంశాలతో ప్రార్థించే వారికి ఇది ఒక అమూల్యమైన కనువిప్పు. ప్రపంచాన్ని నలుమూలలా జరిగే అనేక సంఘటనలను ఈ పుస్తకంలో పొందుపరిచాడు. ఇది సంఘాలకు, ప్రేయర్ సెల్స్‌కు అత్యంత ఉపయోగకరంగా ఉంటుందని నేను భావిస్తున్నాను. ఈ పుస్తకాన్ని చేతపట్టే ప్రతి ఒక్కరు పరిశుద్ధమైన హృదయాలు, విధేయత, విరిగి నలిగిన మనస్సుతో, సమాధానంతో, ప్రార్ధన భారంతో కన్నీటితో నింపబడి పరిశుద్ధాత్మ ద్వారా విజ్ఞాపనకర్తలుగా మలచబడుదురు గాక. ఆమెన్

అభినందనలతో

సిల్వదాసి

శ్రీమతి జి. జోయ్ శామ్ బెన్నీ

ప్రార్థనా పరునికి చేరవలసిన పుస్తకం

అనేక సందర్భాలలో మనం మన వ్యక్తిగత క్షేమము కొరకే ప్రార్థిస్తూ ఉంటాము. అయితే, కేవలం మన వ్యక్తిగత అవసరాల కొరకే ప్రార్థించడం ద్వారా సమాజమంతటా క్షేమము కలుగదు. మన దేశ నాయకులు, పాలకులు, అధికారులు సక్రమముగా, న్యాయముగా, నీతిగా తమ బాధ్యతలను నిర్వర్తించునట్లు మనం ప్రార్థించినప్పుడు, సమాజములో శాంతి, న్యాయం, క్షేమము నెలకొనడానికి అవకాశం కలుగుతుంది. తద్వారా మనమందరము ప్రశాంతముగాను, సుఖముగాను జీవించగలము. ఇలాంటి ప్రార్థన మంచిదియు, మన రక్షకుడగు దేవుని దృష్టికి అనుకూలమైనదియు అని దేవుని వాక్యము చెబుతోంది.

దేశము, నాయకులు, అధికారులు మరియు సమాజ క్షేమము కొరకు క్రమపద్ధతిలో ప్రార్థించడానికి అవసరమైన ప్రార్థనా అంశాలను ఈ పుస్తకము అందిస్తోంది. ప్రతి దినము ఒక నిర్దిష్ట అంశమును తీసుకొని సక్రమముగా ప్రార్థించుటకు ఈ పుస్తకం ఒక మంచి సాధనం.

చైనా దేశములో గొప్ప మిషనరీ సేవ చేసిన జేమ్స్ హడ్సన్ టేలర్ గారు ఇలా అన్నారు: "When we work, we work, when we pray, God works" అనగా, **"మనం పని చేసినప్పుడు మనమే పని చేస్తాము; కానీ మనం ప్రార్థించినప్పుడు దేవుడు పని చేస్తాడు."** మన దేశ క్షేమము కొరకు, న్యాయస్థాపన కొరకు, సువార్త వ్యాప్తి కొరకు అనేకమంది క్రైస్తవ నాయకులు మరియు దేవుని సేవకులు ఎన్నో విధాలుగా కృషి చేస్తున్నారు. అయితే ఆ ప్రయత్నాలన్నీ ఫలవంతమగుటకు ప్రార్థన అత్యవసరం. హడ్సన్ టేలర్ గారు చెప్పినట్లుగా మనం ప్రార్థించినప్పుడు దేవుడు కార్యము చేస్తాడు.

సువార్తను ప్రకటించేటప్పుడు కొన్నిసార్లు మన సేవను ఎవరైనా అడ్డుకోవచ్చు. కానీ ప్రార్థించకుండా మనలను ఎవ్వరూ ఆపలేరు. అందుకే మనం ప్రార్థిద్దాం! ప్రభువు తన వాక్యములో ఇలా సెలవిచ్చారు: "నా పేరు పెట్టబడిన నా జనులు తమ్మును తాము తగ్గించుకొని ప్రార్థన చేసి, నా సన్నిధిని వెదకి, తమ చెడు మార్గములను విడిచినయెడల, నేను ఆకాశమునుండి వారి ప్రార్థనను విని, వారి పాపమును క్షమించి, వారి దేశమును స్వస్థపరచుదును." (2 దినవృత్తాంతములు 7:14) కాబట్టి మనము అడుగుదాం!

పైన పేర్కొన్న ప్రార్థనా అంశాలన్నింటినీ ఎంతో క్రమబద్ధముగా, ప్రార్థనకు ఉపయోగపడే విధముగా ఈ పుస్తకములో పొందుపరచబడ్డాయి. ఈ పుస్తకము ప్రతి ప్రార్థనపరుని చేతికి చేరాలని నా హృదయపూర్వక కోరిక. ప్రార్థనపరులందరూ ఈ అంశాలను తమ వ్యక్తిగత ప్రార్థనలోనూ, కుటుంబ లేదా సహవాస ప్రార్థనలోనూ, సంఘ ప్రార్థనలోనూ పట్టుదలతో ప్రార్థించాలని కోరుతున్నాను.

పాస్టర్ మోజస్ బెన్నీ గారు చేసిన ఈ బృహత్తరమైన ప్రయత్నాన్ని దేవుడు సమృద్ధిగా దీవించి, ఈ పుస్తకము ద్వారా అనేకమందిని ప్రార్థనకు దేవుడు ప్రేరేపించాలని కోరుకుంటున్నాను.

మీ అందరికీ నా హృదయపూర్వక ఆశీస్సులు తెలియజేస్తూ,

ప్రభువు సేవలో,

P.J. **రమ్యరాజు**, FMPB మిషనరీ

366 రోజుల ప్రార్థనలు

ప్రార్థన అనేది ప్రతి విశ్వాసికి దేవుడు దయచేసిన గొప్ప భాగ్యం మరియు బాధ్యత. ప్రార్థన ద్వారా మనం దేవునికి దగ్గరవుతాము, ఆయన చిత్తాన్ని తెలుసుకుంటాము, కృతజ్ఞతలు చెబుతాము, మన అవసరతలను ఆయన ముందుంచుతాము మరియు ఇతరుల కోసం ప్రార్థిస్తాము.

2024లో నేను, నా సతీమణి బ్రదర్ జోసెఫ్ బెన్నీ గారి సంఘమైన 'బెరాకా బ్లెస్సింగ్ చర్చ్'లో మాట్లాడటానికి వెళ్లినప్పుడు, మోజస్ మరియు సబీనా గారి ఇంట్లో బస చేశాము. ఉదయాన్నే మోజస్ భార్య సబీనా మాకు కాఫీ ఇచ్చేవారు. మేము ఇద్దరం చేతులు పట్టుకుని ప్రార్థించడం ఆమె చూసేవారు. మేము వారితో కలిసి అల్పాహారం తింటున్నప్పుడు, మేము ప్రార్థించడం చూసి తాము కూడా క్రమం తప్పకుండా ప్రార్థించాలని నిర్ణయించుకున్నామని మోజస్, సబీనాలు చెప్పారు. ఇప్పుడు వారు '366 డేస్ ఆఫ్ ప్రేయర్' (366 రోజుల ప్రార్థన) పుస్తకాన్ని వ్రాసిన విధానం చూసి నాకు చాలా సంతోషంగా ఉంది!

ఈ పుస్తకం ప్రార్థనను ఒక దైనందిన అలవాటుగా మార్చుకోవడానికి మనకు ఎంతో సహాయపడుతుంది. ఇందులో కుటుంబాలు, సంఘాలు, క్రైస్తవ పరిచర్యలు, మిషనరీలు, మన దేశం, దాని నాయకులు, యువకులు, విద్య, ఆరోగ్యం, సామాజిక సమస్యలు, హింసించబడుతున్న క్రైస్తవులు మరియు సువార్త అందని ప్రాంతాల గురించి ప్రార్థించే అంశాలు ఉన్నాయి.

మన గురించే కాకుండా ఇతరుల గురించి కూడా ఆలోచించమని ఈ పుస్తకం మనకు గుర్తుచేస్తుంది. రోగులు, పేదలు, కష్టాల్లో ఉన్న కుటుంబాలు, పిల్లలు, యువకులు మరియు వివిధ సవాళ్లను ఎదుర్కొంటున్న వారిని ప్రార్థనలో జ్ఞాపకం చేసుకోవాలని ఈ పుస్తకం ప్రోత్సహిస్తుంది.

ఈ పుస్తకాన్ని కేవలం చదవడమే కాదు, దీని ద్వారా ప్రార్థన చేయాలి. పరిశుద్ధాత్మ దేవుడు మన దృష్టిని అనేక అంశాలకు విస్తరింపచేయడానికి మరియు ఇతరుల భారాన్ని మన హృదయాలలో ఉంచడానికి ప్రతిరోజూ కొరకు సిద్ధపరచిన ప్రార్థన అంశాలు ఎంతగానో సహాయపడతాయి. ఈ 366 రోజులు దేవునితో మన సంబంధాన్ని బలపరచుకోవడానికి, ఇతరుల పట్ల మన ప్రేమను పెంచుకోవడానికి మరియు ఆయన రాజ్యానికై మన నిబద్ధతను దృఢపరచుకోవడానికి సహాయపడుతుంది.

ఈ పుస్తకం వ్యక్తులను, కుటుంబాలను మరియు సంఘాలను ప్రార్థనపరులుగా మార్చాలని, మరియు దేవుని ప్రజలలో ఆత్మీయ ఉజ్జీవాన్ని తీసుకురావడానికి ప్రభువు దీన్ని వాడుకోవాలని కోరుకుంటున్నాను.

"నాకు మొఱ్ఱపెట్టుము నేను నీకు ఉత్తరమిచ్చెదను..." (యిర్మీయా 33:3)

మహిమ ఘనత ప్రభావములు దేవునికి మాత్రమే చెల్లును గాక.

జె.ఎస్.ఏ. జూలియస్

ఐ.ఆర్.ఎస్., (రిటైర్డ్) మాజీ అధ్యక్షుడు, UESI బెంగళూరు

ఇది ప్రార్థన బాజా !! పరలోక దర్వాజా !!!

ప్రార్థనను అత్యవసరంలో ఉపయోగించే స్టెపినీ టైరులా భావించేవారు కొందరు, అనునిత్యము వినియోగించే స్టీరింగ్ లాగా వాడేవారు మరికొందరు. నిజానికి ప్రార్థనతోనే క్రైస్తవ జీవితం ఆరంభమౌతుంది (రోమా 10:13). ప్రభువు వచ్చేవరకు కొనసాగవలసి ఉంది (లూకా 21:36). అంత్య కాలంలో విసుగక నిత్యము ప్రార్థన చేయవలెనన్న ఆజ్ఞ మనపై ఉన్నది (లూకా 18:1). సంపూర్ణ భక్తియు, మాన్యతయు కలిగి నెమ్మదిగాను, సుఖముగాను బ్రదుకు నిమిత్తము .... అందరికొరకు ప్రార్థించే బాధ్యత సంఘముపై ఉన్నది (1తిమోతి 2:1). కానీ ప్రార్థించుట ద్వారా ప్రసంగించేవారు కొందరు, ప్రతీకారం తీర్చుకొనేవారు మరికొందరు. ప్రావీణ్యాన్ని కనపరచేవారు ఇంకొందరు. అయితే ఆయన చిత్తానుసారంగా చేసిన ప్రతి ప్రార్థనకు జవాబు దొరుకుతుంది (1 యోహాను 5:14). కాకినాడ కాజా కాదు ! ఇది ప్రార్థన బాజా !! పరలోక దర్వాజా !!!

ప్రార్థనా మార్గదర్శిని అనే ఈ పుస్తకం ఒక సం॥ కాలంలో వివిధ ప్రత్యేక దినాలను మనకు పరిచయం చేయుట మాత్రమే కాక కొన్ని ప్రార్థనా శీర్షికలను, ప్రార్థనాంశాలను ఏరి కూర్చి క్రమబద్ధంగా సరళంగా స్పష్టంగా చేయడానికి సహాయకరం.

ఈ పుస్తక రచయిత సహో॥ మోజెస్ బెన్నీ, వేదాంత విద్య నభ్యసించి యౌవన కాలంలోనే తన తండ్రిగారు, మన ప్రియులు సహో॥ జి.జోసెఫ్ బెన్నీ గారి సేవా వారసత్వాన్ని కొనసాగించడం ముదావహం. ఈ **"ప్రార్థనా మార్గదర్శిని"** మన వ్యక్తిగత, కుటుంబ సంఘ జీవితాలలో ప్రార్థనాధూపం వేయడానికి సహకారిగా ఉండాలని ఆశిస్తూ, అభినందిస్తూ, ...

ప్రభుని సేవలో,

సహో పి. సుధాకర్ బాబు

యెహోవా నిస్సి క్రిస్టియన్ అసెంబ్లీ,

విజయవాడ.

ప్రార్థన ఒక పాఠశాల వంటిది

"సముద్రము జలములతో నిండియున్నట్టు భూమి యెహోవా మాహాత్మ్యమునుగూర్చిన జ్ఞానముతో నిండియుండును." హబక్కూకు 2:14

ప్రభువైన యేసు తన శిష్యులతో "మీరు లోకమునకు వెలుగై యున్నారు" (మత్తయి 5:14) అని అన్నాడు. ఓ గదికో, ఇంటికో, ఊరికో కాదు; లోకానికి! ఓ చిన్న వెలుగు ఇంత పెద్ద లోకానికి ఎలా వెలుగౌతుంది? ఈ లోకానికి వెలుగుగా ఉండటంలో ప్రార్థన ఒక ప్రాథమిక మార్గం కావచ్చు. ప్రార్థనలో మనం లోకాన్ని దేవుని సన్నిధికి తీసుకువెళ్లి, దానికి దీవెనకరంగా ఉంటాము.

"ప్రార్థనా మార్గదర్శిని" అనే ఈ పుస్తకం అదే దిశగా మనలను నడిపిస్తుంది. మనకు తెలిసినవాటినే కాక, మనం ఇంతవరకు ప్రార్థించని అనేక విషయాలను మన ముందుకు తెచ్చి, వాటిని ప్రార్థనా యజ్ఞానికి కట్టెలుగా సమకూరుస్తుంది. దేశం, సమాజం, సంఘం, పరిచర్యలు, వ్యక్తులు, ప్రపంచం, ఇవన్నీ ప్రార్థనకు సంబంధించినవిగా చూడటానికి మనకు సహాయపడుతుంది.

కార్ల్ బార్త్ అనే వేదాంతి యువ వేదాంత విద్యార్థులకు బైబిలును, వార్తాపత్రికలను రెండింటినీ చదవమని సలహా ఇస్తూ, వార్తాపత్రికలను బైబిలు ద్వారా అర్థం చేసుకోమని చెప్పాడు. ఈ పుస్తకం మనలాంటి విశ్వాసులను మరింత ముందుకు తీసుకువెళ్తుంది: **బైబిలుతో లోకాన్ని చూడటమే కాదు, ఆ లోకాన్ని ప్రార్థనలో దేవుని కరుణాపీఠము ముందుకు తీసుకురావడం.**

ప్రార్థన ఒక పాఠశాల వంటిది. అందులో ప్రార్థించడం మాత్రమే కాదు, ఏమి ప్రార్థించాలో, ఎవరి కోసం ప్రార్థించాలో, లోకాన్ని ఎలా చూడాలో కూడా నేర్చుకోవాలి. ఈ పుస్తకం ఆ ప్రార్థనా పాఠశాలలో ఒక ఆచరణాత్మక మార్గదర్శిని. ఇది ప్రార్థనకు ప్రత్యామ్నాయం కాదు సుమా; ప్రార్థనకు మార్గదర్శిని!

మోజెస్ బెన్నీ గారు తమ హృదయంలో దేవుడు ఉంచిన భారాన్ని కార్యరూపంలో మన ముందుకు తీసుకురావడం హర్షణీయం. దేవుడు తన ప్రజలను నడుపుటలో ఈ బిడ్డను మరింతగా వాడుకొనును గాక! ఈ పుస్తకం అనేకుల ప్రార్థనా జీవితాలను, వారి దృక్పథాలనూ, తద్వారా వారి జీవితాలనూ మలచును గాక!!

రెవ. బి. థియోఫిలస్, M.Sc., B.D., M.Th.,
డీన్, బాప్టిస్ట్ థియోలాజికల్ సెమినరీ, కాకినాడ
సంఘ కాపరి, ఆంధ్ర బాప్టిస్ట్ సెంటినరీ చర్చ్, పిఠాపురం
సంఘ కాపరి, బేతేల్ బాప్టిస్ట్ చర్చ్, కాకినాడ

లోటును తీర్చే ప్రార్థన పుస్తకం

క్రైస్తవ జీవితానికి ప్రార్థన చాలా ముఖ్యం. అయినా, "నేను దేని కోసం ప్రార్థించాలి?" అనే ఒక చిన్న ప్రశ్న మనలో చాలా మందికి వస్తూనే ఉంటుంది. బైబిల్ చదవడానికి, అర్థం చేసుకోవడానికి మనకు చాలా పుస్తకాలు ఉన్నాయి. కానీ, ఒక అవగాహనతో ప్రార్థించడానికి దారిచూపే పుస్తకాలు మాత్రం చాలా తక్కువ. ఈ పుస్తకం అలాంటి లోటును తీరుస్తుందని నేను నమ్ముతున్నాను. తెలుగు క్రైస్తవులు మన భారతదేశం కోసం, మన ప్రజల కోసం అర్థవంతంగా ప్రార్థించడానికి ఇది బాగా సహాయపడుతుంది.

మోజెస్ బెన్నీ గారితో నాకున్న స్నేహం వల్ల ఈ పుస్తకం నాకు ఇంకా ఎంతో ప్రత్యేకమైనది. మేమిద్దరం యూనియన్ బిబిలికల్ సెమినరీలో (UBS) నాలుగేళ్లు కలిసి చదువుకున్నాము. అక్కడే మా ఆత్మీయ ప్రయాణంలో ప్రార్థన అనేది ఒక ముఖ్యమైన భాగం అయింది. ఆ రోజుల్లో థియోఫిలాస్ గారు, మోజస్ బెన్నీగారు మనోజ్ గారు మరియు నేను కలిసి, మేము రోజూ UBS ప్రార్థన గదిలో కలుసుకునేవాళ్లం. మా కోసం, సంఘం కోసం, మా భవిష్యత్తు పరిచర్యల కోసం, అలాగే ప్రపంచంలో ఉన్న ఎన్నో అవసరాల కోసం కలిసి ప్రార్థన చేసేవాళ్లం. అక్కడే మేము "ఆపరేషన్ వరల్డ్" (Operation World) అనే పుస్తకం గురించి తెలుసుకున్నాము. అప్పుడే మన భారతదేశం కోసం కూడా ఇలాంటి ఒక పుస్తకం ఉంటే ఎంత బాగుంటుంది కదా అనిపించింది.

కొన్ని సంవత్సరాల తర్వాత, మన భారతదేశం కోసం ఒక ప్రార్థన పుస్తకం తయారు చేయాలని దేవుడు తన హృదయంలో పెట్టిన భారాన్ని మోజెస్ నాతో పంచుకున్నాడు. ఆ దర్శనం ఇప్పుడు ఇలా నిజమవ్వడం చూసి నాకు చాలా సంతోషంగా ఉంది. మన దేశ అవసరాలను అర్థం చేసుకుని, వాటిని దేవుని సన్నిధిలో ఉంచడానికి అవసరమైన రోజువారీ ప్రార్థన అంశాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ముఖ్యంగా ఇది తెలుగు రాష్ట్రాలు, భారతదేశం గురించిన అంశాలతో ఉండటం, పైగా మన తెలుగులో దొరకడం వల్ల... విశ్వాసులకు, కుటుంబాలకు, ప్రార్థన సంఘాలకు, చర్చిలకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

నా ప్రార్థన ఏమిటంటే, ఈ పుస్తకాన్ని కేవలం చదివి వదిలేయకుండా, దీని ఆధారంగా అందరూ ప్రార్థన చేయాలి. భారతదేశ అవసరాల గురించి తెలుసుకోవడం మాత్రమే కాకుండా, మన దేశం కోసం దేవుని సన్నిధిలో విజ్ఞాపనకర్తలుగా ఇది మనల్ని నడిపించాలి. ఈ పేజీలు ప్రార్థనకు ఒక ప్రేరణగా మారాలి. అలానే, మన భారతదేశం భారంతో, నమ్మకంగా ప్రార్థించే ఎంతో మంది విశ్వాసులను దేవుడు లేవనెత్తాలని కోరుకుంటున్నాను.

తిమోతి ముత్యాల

వ్యవస్థాపకులు, కురియోస్ పబ్లికేషన్స్
కన్సల్టెంట్, డల్లాస్ థియోలాజికల్ సెమినరీ.

పరిచయము

ప్రార్థన మార్గదర్శి

"ప్రభువా... మాకును ప్రార్థనచేయ నేర్పు..." (లూకా 11:1)

నా బాల్యంలో మా తల్లిదండ్రులు నాకు నేర్పించిన మొట్టమొదటి, అత్యంత ఇష్టమైన పాఠం 'ప్రార్థన'. చిన్ననాడు మా అమ్మానాన్నలు నాతో, మా అక్కతో కలిసి ప్రతిరోజూ సుదీర్ఘంగా ప్రార్థించేవారు. అప్పట్లో మా అమ్మగారి కన్నీటి ప్రార్థన చూసి నాకు భయంతో పాటు బాధ కూడా కలిగేది. కానీ వయసు పెరుగుతున్న కొద్దీ ఆ కన్నీటి విలువ, ఆ ప్రార్థన శ్రేష్ఠత నాకు అర్థమయ్యాయి. మా తాతగారు జి. జాన్ బెన్నీ గారు ఉదయాన్నే క్రమం తప్పకుండా కుటుంబ ప్రార్థనలు జరిపేవారు. చిన్నపిల్లలమైన మేము ఆ ప్రార్థనలకు హాజరైనందుకు ప్రోత్సాహకంగా మాకు ఒక్కొక్కరికి ఒక రూపాయి పాకెట్ మనీ ఇచ్చేవారు. అలాగునే మా అమ్మమ్మ గారైన శ్రీమతి జ్ఞాన భూషణం గారు, ప్రతీ ఉదయం మూడు గంటలకు లేచి, కుటుంబములో ప్రతి ఒక్కరి కొరకు, సేవకుల కొరకు భారముతో ప్రార్థించేవారు. ఇలా నా బాల్యం, యవ్వనం అంతా ప్రార్థన వాతావరణంలోనే గడిచింది. నేటికీ బంధువులందరం క్రమం తప్పకుండా ఒకచోట చేరి కుటుంబాలుగా ప్రార్థించడం మా ఆనవాయితీ.

"నిండు విశ్వాసము, మొండి ధైర్యంతో ముందుకు కొనసాగాలి" అని మా తాతగారు మాకు ఒక ముఖ్యమైన పాఠం నేర్పించారు. ఆ తాత్పర్యం మన జీవితంలో వాస్తవం కావాలంటే ప్రార్థన తప్ప వేరొక మార్గమే లేదు. మా అక్క షారోన్ రోజ్ తన స్నేహితులతో కలిసి బాల్యం నుండే కన్నీటితో చేసే ప్రార్థనలు చూసి, నేను కూడా ఎప్పటికైనా అలా ప్రార్థించాలని అనుకునేవాడిని. నా ప్రార్థన జీవితంలో అతిపెద్ద మలుపు మా అమ్మ గారి అనారోగ్య సమయం. ఆమెకు రక్త క్యాన్సర్ వచ్చినప్పుడు, 2007వ సంవత్సరంలోనే ఆమె చనిపోతారని అందరూ అనుకున్నారు. కానీ కుటుంబ సభ్యులు, బంధువులు, ముఖ్యంగా సంఘమంతా ఏకగ్రీవంగా చేసిన బలమైన ప్రార్థనల ఫలితంగా, దేవుని కృపతో 2026వ సంవత్సరంలో కూడా ఆమె దేవుని చేత బహుబలంగా వాడుకోబడుతున్నారు. ఆ క్లిష్ట సమయంలో సంఘ ప్రార్థన మమ్మల్ని ఆత్మీయంగా, విశ్వాసంలో ఎంతగానో నిలబెట్టింది.

బైబిల్ కళాశాలకు వెళ్ళిన తర్వాత దేవునిలో నన్ను మరింత బలపరిచింది నా మెంటర్ థియోఫిలస్ గారు. ఆయన ప్రతిరోజు ఉదయాన్నే 5 గంటలకు నాతో పాటు మరో ముగ్గురు స్నేహితులను నిద్రలేపి, యూబీఎస్ (UBS) ప్రార్థన గదిలో ప్రార్థన చేయించేవారు. అప్పుడే నాకు ఒక అద్భుతమైన సత్యం అర్థమైంది: "ప్రార్థన పరిస్థితులను మారుస్తుందో లేదో తెలియదు కానీ, ప్రార్థించే వ్యక్తిని మాత్రం తప్పకుండా మారుస్తుంది". ప్రార్థన ద్వారా మేము అనేక సమస్యలకు జవాబులు పొందుకున్నాము. వివాహమైన తర్వాత, నేను నా భార్య జ్యోతి సబీన క్రమం తప్పకుండా ప్రార్థించేవాళ్ళం. వాడుకగా కాకుండా, ప్రతి రోజూ ఒక ప్రత్యేక అంశం కొరకు (ఉదాహరణకు బుధవారం మిషనరీల కొరకు, గురువారం మా పాత స్నేహితుల కొరకు, శనివారం సంఘ పరిచర్యలు, సభ్యుల కొరకు) ప్రార్థించాలని తీర్మానించుకున్నాము. కానీ అప్పట్లో అది పూర్తిగా ఆచరణలోకి రాలేదు.

ఈ పుస్తక రచనకు అసలు బీజం కాకినాడలో పడింది. అక్కడి 'సిటీ పాస్టర్స్ ఫెలోషిప్' (CPF) వారు 40 రోజుల వేకువజాము ప్రార్థనలు జరిపినప్పుడు, వారికోసం ప్రతిరోజూ 12 ప్రార్థనాంశాలను సిద్ధం చేసే భారాన్ని దేవుడు నాకు అప్పగించారు. అది అనేకమంది పాస్టర్లకు, వారి సంఘాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని వారు నాతో పంచుకున్నారు. అప్పుడే, ఒక సమగ్రమైన ప్రార్థన పుస్తకాన్ని తయారుచేయాలన్న దేవుని తలంపు నాలో మొదలైంది.

సరిగ్గా అదే సమయంలో మా నాన్నగారికి కాలులో క్యాన్సర్ వచ్చింది. మళ్ళీ మాకు తెలిసిన ఏకైక ఆధారమైన దేవుని పాదాలు పట్టుకొని ప్రార్థించడం మినహా వేరే మార్గం లేదు. ఆ కష్టకాలంలోనే దేవుడు నన్ను బలంగా ప్రేరేపించి, పగలు రాత్రి అని తేడా లేకుండా అనేక గంటలు శ్రమపడి ఈ పుస్తకాన్ని పూర్తిచేసే కృపను అనుగ్రహించారు.

ఈ పుస్తకంలో ఏముంది? ప్రార్థన చేయడానికి ఏ అంశాల కొరకు ప్రార్థించాలో అర్థం కాని స్థితిలో ఉన్నవారికి ఈ **"ప్రార్థనా మార్గదర్శిని"** ఒక దిక్సూచిలా ఉపయోగపడుతుంది. ఈ పుస్తకంలో సుమారు 2000 ప్రార్థనాంశాలను పొందుపరిచాము. ఇందులో భారతదేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, వివిధ వృత్తులు, వ్యాపారాలు, దేశంలో తరచుగా జరిగే నేరాలు, వాటి కారణాలు, వివిధ రకాల వ్యసనాలు, వయసును బట్టి వచ్చే మానసిక మరియు ఆరోగ్య సమస్యలు, పాస్టర్ల (సేవకుల) అవసరతలు, సంఘ పరిచర్యలు, మిషనరీ సంస్థలు, క్రైస్తవ ఆసుపత్రులు, కళాశాలలు, వివిధ డినామినేషన్లు, దేవుని కొరకు వాడబడిన ప్రార్థనా పరులు మరియు హతసాక్షుల గురించిన వివరాలు ఉన్నాయి.

సుమారు ప్రతి వారానికి 40 వేర్వేరు అంశాలను సిద్ధం చేయడం జరిగింది. కొన్ని ముఖ్యమైన అంశాల కొరకు ప్రత్యేక భారం కలిగి ప్రార్థించాలన్న ఉద్దేశంతో అవి రెండు మూడు సార్లు పునరావృతం అయ్యేలా అమర్చాము. ప్రతి రోజూ ఐదు లేదా ఆరు అంశాల కొరకు, ఒక్కో అంశానికి 5 నుండి 6 నిమిషాల చొప్పున ప్రార్థించగలిగితే, ప్రతిరోజూ కనీసం అరగంట పాటు అర్థవంతమైన ప్రార్థన చేయవచ్చు. వ్యక్తిగత ప్రార్థనలకు మాత్రమే కాకుండా, సంఘములలో ఉపవాస మరియు సంపూర్ణ రాత్రి ప్రార్థనలకు, ప్రత్యేక ప్రార్థన కూడికలకు ఈ పుస్తకం ప్రయోజనకరంగా ఉంటుంది.

కృతజ్ఞతలు: నన్ను ప్రార్థనలో ఎత్తిపట్టుకుంటూ, ఈ ప్రార్థన పుస్తకాన్ని సిద్ధపరచడంలో సుమారు 20మంది భక్తిపరులైన ప్రార్థనా పరులు తమ సలహాలు, సూచనలు ఇచ్చి ఎన్నో మార్పులు చేశారు. వారిలో ముఖ్యంగా దేవుని సేవకురాలు జోయ్ శామ్‌బెన్నీ గారు పుస్తకాన్నంతా క్షుణ్ణంగా పరిశీలించి అనేక మార్పులను సూచించారు. ప్రార్థనతో బలపరచిన సేవకులు, సోద. ఎమ్.సమర్పణ్ గారికి వందనాలు. అలాగే, ఈ పుస్తకాన్ని టైప్ చేయడంలో సహాయపడిన షారోన్ ఆఫ్‌సెట్ రాజేష్ గారికి నా ప్రత్యేక వందనాలు. ఎడిటింగ్ పనుల కోసం సహాయం చేసిన సహో సంజయ్‌కి వందనాలు.

నేను అడిగిన వెంటనే ఎంతో అమూల్యమైన ప్రోత్సాహంతో ఈ పుస్తకానికి పరిచయ వాక్కులు వ్రాసిన **బ్రదర్ ప్రకాష్ గారు, సిద్ధిపేట, దా॥ పి.ఎ. స్వామి గారు, దా॥జోబ్ సుదర్శన్ గారు, దా॥ జూలియస్ గారు, శ్రీమతి జాయ్ శామ్ బెన్నీ గారు, రెవ.సుధాకర్ అన్నగారు, నా మెంటర్ థియోఫిలస్ గారు, శ్రీమతి మొండితోక శాంత కుమారి గారు** మరియు నా ప్రియ మిత్రుడు **ముత్యాల తిమోతి** గార్లకు నా ప్రత్యేక కృతజ్ఞతలు.

నా కొరకు నిత్యం ప్రార్థన చేసే మా స్థానిక సంఘములు, మా బావ గారైన వల్లూరి సుందరా సింగ్ గారు, మరియు అక్క శ్రీమతి షారోన్ రోజ్ గార్లకు, శ్రీమతి కన్న గారు, పాస్టర్ సత్యతేజ్ గారు & శ్రీమతి వనజ గార్లకు, కాకినాడ జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ మరియు కాకినాడలోని అన్ని పాస్టర్ ఫెలోషిప్స్ వారికి నా వందనాలు. ఈ పుస్తకాన్ని సిద్ధపరచడానికి నేను ఎంతో సమయాన్ని వెచ్చించాల్సి వచ్చినప్పుడు, నా పిల్లలు జాషువా, గ్రేస్ బాధ్యతలను పూర్తిగా తన భుజాలపై వేసుకొని, ఎంతో త్యాగపూరితంగా నాకు సహకరించిన నా ప్రియ సతీమణి సబీనాకు నా ప్రత్యేక వందనాలు.

నా ప్రార్థనలు ఆలకించే నా ప్రభువు, నా పరలోకపు తండ్రికి సమస్త మహిమ, ఘనత, ప్రభావములు ఎల్లప్పుడూ కలుగును గాక! ఆమేన్.

ఇట్లు.. ప్రార్థనతో,

జి. మోజెస్ బెన్ని

14 సెప్టెంబర్ 2026

1 జనవరి

కీర్తనలు 143:10 "నీవే నా దేవుడవు నీ చిత్తానుసారముగా ప్రవర్తించుటకు నాకు నేర్పుము దయగల నీ ఆత్మ సమభూమిగల ప్రదేశమందు నన్ను నడిపించును గాక."

1. నూతన సంవత్సర మరియు ప్రపంచ శాంతి దినోత్సవం : గత సంవత్సరమంతా తన కృపలో భద్రపరిచి, ఈ నూతన సంవత్సరంలో సజీవులుగా ప్రవేశపెట్టిన మన ప్రభువునకు నిండు హృదయంతో కృతజ్ఞతా స్తుతులు చెల్లిద్దాం. ఈ కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబంలో మరియు సమాజంలో దేవుడు తన దైవిక సమాధానాన్ని మెండుగా, సంతోషంగా నింపాలని ప్రార్థిద్దాం. అలాగే నేడు ప్రపంచ దేశాల మధ్య రగులుతున్న భయంకరమైన యుద్ధాలు, ద్వేష భావాలు, పగలు ఆగిపోయి, ప్రజలందరి మధ్య నిజమైన శాంతి నెలకొనాలని, మన దేశము కోసం ప్రత్యేకంగా ప్రార్థిద్దాం.

2. నూతన సంవత్సర వేడుకలు, కూడికల కొరకు : ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న నూతన సంవత్సర వేడుకలు అన్నీ సక్రమంగా జరిగి, దేవుని నామానికి మాత్రమే మహిమకరంగా ఉండాలని ప్రార్థిద్దాం. సంఘాలలో దేవుని జీవముగల వర్తమానం స్పష్టంగా అందించబడేలాగున, ప్రార్థన కూడికలలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు లేదా ఆటంకాలు లేకుండా ఆత్మీయంగా దేవుడు సంఘాన్ని దీవించి వాడుకునేలాగున వేడుకుందాం. ఎక్కడ ఎటువంటి దాడులు జరగకుండా ప్రభువు తన కాపుదల ఉంచి, ఈరోజు జరిగే ఆరాధనలన్నీ దేవుని మహిమ కొరకు జరిగేలాగున ప్రార్థిద్దాం.

3. నూతన సంవత్సర తీర్మానాలు, దేవుని చిత్తం : ఈ క్రొత్త సంవత్సరంలో మన ఆత్మీయ జీవితం కొరకు మనం తీసుకునే నిర్ణయాలన్నీ దేవుని వాక్యానుసారంగా ఉండేలాగున, ప్రార్థన పూర్వకంగా మంచి నిర్ణయాలు తీసుకునేలాగున ప్రార్థిద్దాం. ఆ తీర్మానాలను ప్రతి దినము ఆచరించి మనము అనుకున్న లక్ష్యమును సాధించాలని దేవునిపై ఆనుకుందాం. మన సొంత జ్ఞానం, శక్తి మీద ఆధారపడక కేవలం దేవుని అపారమైన కృప కొరకు కనిపెడుతూ, ప్రతినిత్యం దేవుని చిత్తమును మాత్రమే జరిగించాలని అనుదిన ప్రార్థనలలో శ్రద్ధగా జ్ఞాపకం చేసుకుందాం.

4. బలహీనులైన వారి స్వస్థత కొరకు ప్రార్థన : గత సంవత్సర కాలంలో వివిధ రకములైన బలహీనతలతో, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడిన వారు ఈ నూతన సంవత్సరంలో ప్రభువు దయను పొందుకోవాలని ప్రార్థిద్దాం. దేవుడు తన గాయపడిన హస్తాలతో వారిని ముట్టి బాగుచేసి, వారి జీవితంలో దేవుని అద్భుత కార్యములు బలంగా జరగాలని వేడుకుందాం. మన ఆత్మీయుల కొరకు, కుటుంబ సభ్యుల కొరకు, అలాగే అనారోగ్యంతో ఉన్న మన సంఘ సభ్యుల కొరకు, శారీరక బలహీనతలు ఉన్న వారిని మన ప్రార్థనలో జ్ఞాపకం చేసుకుందాం.

5. మన దేశము, ఇరుగుపొరుగు ప్రాంతాల క్షేమం : ఈ సంవత్సరమంతా మన దేశము అన్ని విధాలుగా క్షేమంగా, సురక్షితంగా ఉండాలని దేవుని సన్నిధిలో ప్రార్థిద్దాం. దేశం కొరకు పాటుపడుతున్న సైనికులు, ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు క్షేమంగా ఉండి, దేవుడు వారికి ఇచ్చిన బాధ్యతను ఈ సంవత్సరం అంతా చక్కగా, నీతిగా నిర్వహించాలని ప్రార్థిద్దాం. మన ఇరుగుపొరుగు వారు కూడా క్షేమంగా ఉంటూ, ఈ సంవత్సరం దేశానికి క్షేమము చేకూర్చాలని, మంచి వర్షాలు కురిసి మంచి పంటలు పండాలని, వ్యాపారాలు జరగాలని ప్రార్థిద్దాం.

6. క్రైస్తవ పరిచర్యలు, మిషనరీలు, సంఘ క్షేమం : ఈ సంవత్సరం దేవుడు మన స్థానిక సంఘము ద్వారా, అలాగే క్రైస్తవ మిషనరీ సంస్థల ద్వారా జరిగిస్తున్న పరిచర్యలు నమ్మకంగా, దేవునికి మహిమకరంగా జరిగించాలని కోరుకుందాం. ప్రతి సంఘంలో దైవిక ఐక్యత వర్ధిల్లాలని, క్రైస్తవులు క్షేమంగా ఉండాలని వేడుకుందాం. ముఖ్యంగా హింసలలో ఉన్న విశ్వాసులు ఆత్మీయంగా బలపడి దేవుని కొరకు మంచి సాక్షులుగా నిలబడాలని ప్రార్థిద్దాం. మిషనరీ సంస్థల కొరకు, క్రైస్తవ ఆర్గనైజేషన్స్ కొరకు, మన సంఘం దేవునిలో నిలకడగా ఉండాలని జ్ఞాపకం చేసుకుందాం.

2 జనవరి

కీర్తనలు 119:18 "నేను నీ ధర్మశాస్త్రమునందు ఆశ్చర్యమైన సంగతులను చూచునట్లు నా కన్నులు తెరువుము."

1. ప్రపంచ ఇంట్రోవర్ట్ దినోత్సవం: ఈ రోజు నెమ్మదిగా, ప్రశాంతంగా గడపడానికి ఇష్టపడే అంతర్ముఖుల (introverts) కోసం ప్రత్యేకించబడింది. వారు తమ స్వంత ఆలోచనల్లో సమయం గడుపుతూ సమాజానికి ప్రశాంతమైన బలాన్ని ఇస్తారు. దేవుడు వారిని అద్భుతంగా సృష్టించిన విధానాన్ని గుర్తిస్తూ, వారు దేవునిలో ఎదిగి, సంఘంలో మరియు లోకంలో తమ ప్రత్యేక పాత్రను చక్కగా పోషించాలని మనమందరం ప్రార్థిద్దాం.

2. దేవునికి స్తుతులు : గడిచిన వారం అంతా తన రెక్కల చాటున భద్రపరచి, ప్రతి ప్రమాదం మరియు అపాయము నుండి కాపాడిన దేవునికి కృతజ్ఞతలు చెల్లిద్దాం. మనకు జీవము ఇచ్చిన దేవునికి స్తోత్రం. ఈ నూతన దినములో ఆయన కృప మనపై ఉన్నందున, మన పూర్వకమైన స్తుతులు ప్రభువుకు అర్పిస్తూ ప్రార్థిద్దాం.

3. మన చుట్టుపక్కల కిరాణా దుకాణదారుల కొరకు : మన చుట్టుపక్కల ఉండి మనకు ఎంతో నమ్మకమైన సహాయకులుగా ఉంటున్న కిరాణా దుకాణదారులను ఈ రోజు ప్రత్యేకంగా ప్రార్థనలో జ్ఞాపకం చేసుకుందాం. వారు మన అనుదిన అవసరాలు తీర్చడంలో ఉదయం నుండి రాత్రి వరకు ఎంతో కష్టపడుతున్నారు. వారు చేసే వ్యాపారంలో పరిపూర్ణమైన నిజాయితీ, దేవుని భయం కలిగి ఉండాలని, వారి కుటుంబాలకు దేవుడు తగిన ఆరోగ్యము, శాంతి, భద్రత మరియు ఆర్థిక దీవెనలు మెండుగా దయచేసి వారిని ఆశీర్వదించాలని ప్రార్థిద్దాం.

4. సప్లై చైన్ మేనేజర్స్ కొరకు : భారతదేశంలో సప్లై చైన్ మేనేజర్లు రోజూ మౌలిక సదుపాయాల లేమి, ఊహించని ట్రాఫిక్ మరియు రవాణా ఆలస్యాలు, మారుతున్న ప్రభుత్వ నిబంధనలు, కార్మికుల కొరత, అంచనాలకు మించిన మార్కెట్ ఒత్తిడులు, సరుకుల భద్రత, మరియు కష్టతరమైన లాజిస్టిక్స్ సమస్యలు వంటి అనేక ఆచరణాత్మక సవాళ్లు ఎదుర్కొంటారు. ఈ కష్టతరమైన వృత్తిపరమైన అడ్డంకులను వారు సమర్థవంతంగా దాటడానికి దేవుడు తన అపారమైన జ్ఞానం, మానసిక బలం, మంచి ఆరోగ్యం మరియు దైనందిన విధుల్లో సంపూర్ణ రక్షణ దయచేయాలని, అలాగే వారికి పని స్థలంలో అనుకూలమైన మంచి వాతావరణం దయచేయాలని ప్రార్థిద్దాం.

5. భవిష్యత్తు తరాల కొరకు (డిజిటల్ వ్యసనం): నేటి యువత, ముఖ్యంగా జెనరేషన్ జెడ్ (జెన్ జి), ఆల్ఫా మరియు రాబోయే బీటా తరాల పిల్లలు మొబైల్ ఫోన్లు, వీడియో గేమ్స్, మరియు సోషల్ మీడియా వంటి వాటికి తీవ్రంగా బానిస లవుతున్నారు. ఈ డిజిటల్ వ్యసనం వల్ల కలిగే నష్టం సాధారణమైనది కాదు. దీని వల్ల వారు తమ అత్యంత విలువైన సమయం, చదువుపై ఏకాగ్రత మరియు దేవునితో గడపాల్సిన ఆత్మీయ సహవాసాన్ని కూడా పూర్తిగా కోల్పోతున్నారు. కుటుంబ బంధాలు దెబ్బతింటున్నాయి మరియు శారీరక శ్రమ తగ్గిపోతోంది. ఈ చెడు ప్రభావం వారి ఉజ్వల భవిష్యత్తు మరియు సున్నితమైన మానసిక ఆరోగ్యంపై చాలా తీవ్రంగా ఉండి, వారిని ఒంటరితనంలోకి నెట్టివేస్తుంది. కనుక, దేవుడు ఈ చిన్న పిల్లలను మరియు యౌవనస్తులను ఈ లోక సంబంధమైన డిజిటల్ మాయ నుండి పూర్తిగా విడిపించి కాపాడాలి. వారు జీవముగల సత్యమును స్పష్టంగా తెలుసుకొని, దేవుని వాక్యం పట్ల అమితమైన ఆసక్తి పెంచుకుని, ఎంతో ఆరోగ్యకరమైన, క్రమశిక్షణ కలిగిన దైవిక జీవితం జీవించేలా మనము భారం కలిగి దేవుని సన్నిధిలో వేడుకుంటూ ప్రార్థన చేద్దాం.

3 జనవరి

కీర్తనలు 5:8 "యెహోవా, నా కొఱకు పొంచియున్న వారినిబట్టి
నీ నీత్యానుసారముగా నన్ను నడిపింపుము; నీ మార్గమును నాకు స్పష్టముగా కనుపరచుము."

1. అంతర్జాతీయ మనో-శారీరక ఆరోగ్య దినోత్సవం (International Mind-Body Wellness Day) ఈరోజు ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మనో-శారీరక ఆరోగ్య దినోత్సవంగా గుర్తిస్తున్నారు. ఆధునిక కాలంలో తీవ్రమైన మానసిక ఆందోళనలు, నిరాశ మరియు శారీరక రోగాల వంటి సవాళ్ళను ఎదుర్కొంటూ, నెమ్మది లేక తల్లడిల్లుతున్న అనేకమంది ప్రజలను జ్ఞాపకం చేసుకుందాం. మానవాళికి దేవుడు సంపూర్ణ ఆరోగ్యాన్ని, ఆత్మలోను శరీరంలోను శాంతిని అనుగ్రహించాలని, రోగులకు దైవిక స్వస్థతను దయచేసి ప్రతి ఒక్కరూ క్రీస్తు యేసు నందు లభించే నిజమైన ఆత్మీయ ఆనందాన్ని పొందుకునేలా కృప చూపాలని ప్రార్థిద్దాం.

2. విశ్వవాణి (Vishwavani) **పరిచర్య** 'విశ్వవాణి' (Vishwa vani) కొరకు ప్రార్థిద్దాం మిషనరీ సంస్థను దేవుడు దీవించును గాక. 1980వ దశకంలో ప్రారంభమైన ఈ గొప్ప స్వదేశీ సంస్థ, ప్రస్తుతం భారతదేశంలోని సుమారు 20కి పైగా రాష్ట్రాలలో విస్తరించి, వందలాది మిషన్ ఫీల్డ్స్‌లో సువార్త అందని ప్రజలకు క్రీస్తు ప్రేమను ప్రకటిస్తోంది. ఈ సంస్థ ద్వారా ప్రస్తుతం 1,200 కంటే ఎక్కువ మంది నమ్మకమైన మిషనరీలు పూర్తి సమయం క్షేత్ర స్థాయిలో ఆత్మీయ సేవ చేస్తున్నారు. విశ్వవాణి సంస్థ రేడియో పరిచర్య, చర్చి ప్లాంటింగ్, గిరిజన క్షేమ సేవలు, పిల్లల విద్యా కేంద్రాలు మరియు ఉచిత వైద్య శిబిరాల వంటి సుమారు 10కి పైగా వైవిధ్యభరితమైన పరిచర్యలను నిర్వహిస్తోంది. సువార్త వ్యాప్తిలో మిషనరీలు ఎదుర్కొంటున్న తీవ్ర వ్యతిరేకతలు, శారీరక దాడుల వంటి సవాళ్ళ నుండి దేవుడు వారికి సంపూర్ణ రక్షణ కల్పించాలని, నూతన ప్రాంతాలలో పరిచర్య విస్తరించుటకు అవసరమైన ఆర్థిక వనరులను ప్రభువు సమృద్ధిగా దయచేయాలని ప్రార్థిద్దాం.

3. మానసిక ఆరోగ్య మరియు కౌన్సిలింగ్ పరిచర్య (Mental Health & Counselling Ministry) కొరకు ప్రార్థన వివిధ స్థానిక సంఘముల ద్వారా జరిగిస్తున్న మానసిక ఆరోగ్య మరియు కౌన్సిలింగ్ పరిచర్యను దేవుడు ఆశీర్వదించును గాక. నేటి సమాజంలో ఒంటరితనం, ఆత్మహత్యా సదృశ్య ఆలోచనలు మరియు నిరాశ వంటి సవాళ్లతో బాధపడుతున్న వారికి సరైన ఆత్మీయ ఓదార్పును అందించుటలో సంఘానికి జ్ఞానము కావాలి. ఈ పరిచర్య ద్వారా అనేకుల హృదయ గాయాలు క్రీస్తు ప్రేమతో నయం చేయబడి, వారు ఆత్మీయ సమాధానం పొందేలా కృప చూపాలని ప్రార్థిద్దాం.

4. నూతన విశ్వాసుల ఆత్మీయ శిష్యత్వ పరిచర్య కొరకు ప్రార్థన : మన సంఘ కాపరి గారు నూతనంగా రక్షించబడిన విశ్వాసులను క్రీస్తు కొరకు నమ్మకమైన శిష్యులుగా సిద్ధపరిచే పరిచర్యను దేవుడు ఫలభరితం చేయునట్లు ప్రత్యేకంగా ప్రార్థిద్దాం. పాత అలవాట్లు, లోక ఆకర్షణలు మరియు కుటుంబాల నుండి వచ్చే వ్యతిరేకతల వంటి సవాళ్లను జయించి నూతన విశ్వాసులు వాక్యంలో ఎదగాలి. కాపరి గారు వారిని ఆత్మీయంగా పోషిస్తూ, సంఘాన్ని క్రీస్తు కొరకు బలమైన సాక్షిగా నిలబెట్టేలా దేవుని కృప తోడై ఉండాలని ప్రార్థిద్దాం.

5. ఆధ్యాత్మిక ఎదుగుదల - పూర్ణహృదయంతో దేవుని ప్రేమించుట (Love God Wholeheartedly) **కొరకు ప్రార్థన :** నా వ్యక్తిగత ఆధ్యాత్మిక ఎదుగుదల కొరకు ఈ వారము ఈ లేఖనముల ఆధారముగా నేను పూర్ణహృదయముతో దేవుని ప్రేమించుచు వాక్యానుసారమైన లక్షణములు కలిగి జీవించునట్లు సహాయం చేయండి మరియు నా జీవితంలో, నా కుటుంబ జీవితంలో, సంఘ జీవితంలో ఈ విషయమై కృప చూపండి. "నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణమనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెను" (మత్తయి 22:37, ద్వితీ. 6:5) అన్న వాక్యాను సారంగా నేను లోక ఆశలను విడిచి, కేవలం దేవునికే నా ప్రథమ స్థానాన్ని ఇస్తూ ఆత్మీయంగా ఎదగాలని ప్రార్థిద్దాం.

4 జనవరి

కీర్తనలు 7:9 – హృదయములను అంతరింద్రియములను పరిశీలించు నీతి గల దేవా, దుష్టుల చెడుతనమును మాన్పుము, నీతిమంతులను స్థిరపరచుము.

1. ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం (World Braille Day) దృష్టిలోపం ఉన్నవారు సులభంగా చదువుకోవడానికి బ్రెయిలీ లిపిని కనిపెట్టిన లూయిస్ బ్రెయిలీ జన్మదినం నేడు. ఈ ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం సందర్భంగా, దేశవ్యాప్తంగా ఉన్న దృష్టి లోపం మరియు అంధత్వం ఉన్నవారికి విద్యాసంస్థల్లో, ఉద్యోగాల్లో, సమాజంలో సమానమైన హక్కులు, అవకాశాలు మెండుగా లభించాలని మనం ప్రత్యేకంగా ప్రార్థించాలి. క్రైస్తవ సంఘాలు, ప్రభుత్వ సంస్థలు వారి పట్ల క్రీస్తు ప్రేమను ఆచరణాత్మకంగా చూపించి, వారి భవిష్యత్తును ఆదరించేలా దేవుని సహాయం అడుగుదాం.

2. భారతదేశం (India) **ఈ రోజు మనం భారతదేశం కొరకు ప్రార్థిద్దాం.** సుమారు 144 కోట్ల జనాభాతో, హిందూ మతం అత్యధికంగా ఆచరించబడే మన దేశంలో, ముస్లింలు, సిక్కులు, ఇతరులు కూడా ఎంతోమంది ఉన్నారు. ఇక్కడ క్రైస్తవులు కేవలం 2.3 శాతం మాత్రమే ఉన్నారు. నేడు మన దేశం ఎదుర్కొంటున్న జాతీయ రాజకీయ నాయకత్వం, ఆర్థిక అసమానతలు, నాణ్యమైన విద్యా వ్యవస్థ, పేదరికం, మతస్వేచ్ఛ, ఆరోగ్య సంరక్షణ వంటి ఈ పరిస్థితులు, సవాళ్ళు (సవాళ్ళు) ఎన్నో ఉన్నాయి. అలాగే పర్యావరణపరమైన ఇబ్బందులు కూడా ప్రజలను కలవరపెడుతున్నాయి. భిన్న సంస్కృతుల మధ్య శాంతి, సామాజిక న్యాయం వర్ధిల్లాలి. దేశవ్యాప్తంగా అసంఖ్యాకమైన చేరుకోబడని ప్రజల మధ్య అహర్నిశలు సేవ చేస్తున్న మిషనరీలు, స్థానిక సంఘాల రక్షణ మరియు సువార్త వ్యాప్తికై ప్రార్థన భారంతో వేడుకుందాం.

3. భారత రాష్ట్రపతి (President of India) భారతదేశ ప్రథమ పౌరులైన రాష్ట్రపతికి రాజ్యాంగం అత్యున్నత అధికారాలను ఇచ్చింది. దేశ భద్రత, చట్టాల ఆమోదం విషయంలో ఈ పదవిలో ఉన్నవారికి ఎంతో ఒత్తిడి, బాధ్యతలు ఉంటాయి. ఆ అధికారాలు ఏమాత్రం దుర్వినియోగం కాకుండా, దేశ పాలనలో న్యాయం, సామాజిక సామరస్యం వృద్ధి చెందాలి. వారు నిష్పక్షపాతంగా, నీతిగా, జవాబుదారీతనంతో, దీనమనస్సుతో కూడిన దైవిక జ్ఞానముతో దేశాభివృద్ధికి తగిన నిర్ణయాలు తీసుకునేలా మనం విజ్ఞాపన చేయాలి.

4. విద్యా మంత్రిత్వ శాఖ (Ministry of Education) భారత విద్యా మంత్రిత్వ శాఖ దేశవ్యాప్త విద్యా విధానాలు, జాతీయ పరీక్షలను పర్యవేక్షిస్తుంది. మన భారతీయ విద్యా వ్యవస్థలో దాదాపు 26 కోట్ల మంది విద్యార్థులు దేశవ్యాప్తంగా వివిధ వయస్సుల్లో చదువుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వీరు సరైన వసతులు, నాణ్యమైన విద్యావకాశాలు లేక అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారు.

ఇటీవల ఎదురైన పరీక్షల పేపర్ లీకులు, నిర్వహణ లోపాల నేపథ్యంలో, అధికారులలో నిజాయితీ, పారదర్శకత, న్యాయమైన పాలన కోసం ప్రార్థిద్దాం. అలాగే క్రైస్తవ విద్యార్థులు తమ ప్రవర్తన ద్వారా తోటి విద్యార్థులకు క్రీస్తు ప్రేమను చూపే సాక్షులుగా నిలబడాలి. విద్యార్థుల మధ్య సేవ చేస్తున్న UESI, FOCUS, CRU, YFC సంస్థల పరిచర్యలు మరింత ఫలవంతం కావాలని ప్రార్థిద్దాం.

5. యాదవ్ (అహిర్) ప్రజా జాతి (Yadav - Ahir People Group) యాదవ్ (అహిర్) ప్రజా జాతి ప్రజలు ప్రధానంగా ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో సుమారు 6 కోట్లకు పైగా విస్తరించి ఉన్నారు. సనాతన హిందూ సంప్రదాయాలను బలంగా ఆచరించే వీరు అనేక సామాజిక, ఆర్థిక, ఆధ్యాత్మిక సవాళ్లు ఎదుర్కొంటున్నారు. వీరి మధ్య సువార్త వెళ్లడానికి ఉన్న ఆచారపరమైన అడ్డంకులు తొలగిపోయి, నేడు సేవచేస్తున్న మిషనరీలు, ఇవాంజెలికల్ సంస్థల ద్వారా అనేకులు క్రీస్తును తెలుసుకొని నిజమైన రక్షణ పొందేలాగున ప్రార్థిద్దాం.

5 జనవరి

కీర్తనలు 119:66 "నేను నీ ఆజ్ఞలయందు నమ్మిక యుంచియున్నాను
మంచి వివేచన, మంచి జ్ఞానము నాకు నేర్పుము."

1. జాతీయ పక్షుల దినోత్సవం జనవరి 5న జాతీయ పక్షుల దినోత్సవం జరుపుకుంటారు. దేవుడు అద్భుతంగా సృష్టించిన అందమైన పక్షులను, ప్రకృతి పర్యావరణాన్ని సంరక్షించవలసిన బాధ్యతను ఇది మనకు గుర్తుచేస్తుంది. అంతరించి పోతున్న పక్షుల జాతులను కాపాడే పర్యావరణవేత్తల కోసం, వన్యప్రాణి సంరక్షకుల కోసం ప్రత్యేకంగా ప్రార్థిద్దాం. దేవుని సృష్టిని మనం బాధ్యతగా చూసుకునేలా దేవుడు మనకు మంచి జ్ఞానం ఇవ్వాలని వేడుకుందాం.

2. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈ రోజు మనం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొరకు ప్రార్థిద్దాం. సుమారు 5.3 కోట్ల జనాభా కలిగిన ఈ రాష్ట్రంలో హిందువులు మెజారిటీగా ఉండగా, క్రైస్తవులు సుమారు 1.4 శాతంగా ఉన్నారు. రాష్ట్రంలో 175 మంది ఎమ్మెల్యేలు, 25 మంది లోక్‌సభ ఎంపీలు, 11మంది రాజ్యసభ ఎంపీలు ఉన్నారు. రాష్ట్ర రాజకీయ నాయకత్వం, సుపరిపాలన కొరకు, రైతుల వ్యవసాయ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడాలని ప్రార్థిద్దాం. తరచుగా వచ్చే తుఫాన్ల వల్ల నష్టపోతున్న కుటుంబాలను, పేదరికం, నిరుద్యోగం లాంటి సామాజిక సవాళ్లు ఎదుర్కొంటున్న వారిని దేవుడు ఆదుకోవాలి. మారుమూల ప్రాంతాల్లో సువార్త అందని ప్రజల మధ్య సంఘాలు, మిషనరీలు ధైర్యంగా సేవ చేసేలా దేవుడు వారిని కాపాడాలి. ఈ పరిస్థితులు చక్కబడి, రాష్ట్రంలో శాంతి, సమానత్వం, అభివృద్ధి కలగాలని ప్రభువును వేడుకుందాం.

3. 0-6 నెలల శిశువులు: తక్కువ బరువు మరియు పోషకాహార లోపం భారతదేశంలో సుమారు 15-20% శిశువులు తక్కువ బరువుతో, పోషకాహార లోపంతో పుడుతున్నారు. దీనివల్ల వారు సులభంగా ఇన్ఫెక్షన్ల బారిన పడతారు, వారి శారీరక ఎదుగుదల దెబ్బతింటుంది. సరైన వనరులు లేక ఇబ్బంది పడుతున్న కుటుంబాల కోసం, తల్లుల ఆరోగ్యం కొరకు ప్రార్థిద్దాం. మీ కుటుంబంలో కానీ, ఇరుగుపొరుగు వారిలో కానీ, మీ సంఘంలో కానీ ఈ వయసువారు మీకు తెలిసిన వారు ఉన్నట్లయితే, వారికొరకు ప్రార్థిద్దాం.

4. మానసిక ఆరోగ్యం : తీవ్రమైన కుంగుబాటు (డిప్రెషన్) మన దేశంలో సుమారు 4.5 శాతం మంది డిప్రెషన్ లేదా తీవ్రమైన కుంగుబాటు (Major Depressive Disorder) సమస్యతో బాధపడుతున్నారు. ఒత్తిడి వల్ల వచ్చే ఈ సమస్య వారి భావోద్వేగ, శారీరక, మరియు దైనందిన జీవితాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. వీరికి సరైన వైద్యం, కుటుంబ సభ్యుల మద్దతు లభించాలని ప్రార్థిద్దాం. ఈ మానసిక వేదన నుండి వారికి స్వస్థత, విడుదల కలగాలని, వారిని చూసుకునే వారికి మరియు వైద్యులకు దేవుడు మంచి జ్ఞానం దయచేయాలని ప్రభువును వేడుకుందాం.

5. సెరంపూర్ కళాశాల,పశ్చిమ బెంగాల్ మన దేశంలో దెవుని బిడ్డలచెత ప్రారంభించబడి నడుపబడుతున్న ప్రసిద్ధ సెరంపూర్ కళాశాల (Serampore College) కొరకు ప్రార్థిద్దాం. పశ్చిమ బెంగాల్‌లోని సెరంపూర్‌లో ఉన్న ఈ చారిత్రక విద్యాసంస్థను 1818వ సంవత్సరంలో ప్రముఖ మిషనరీలు విలియం కేరీ, జాషువా మార్ష్‌మన్, మరియు విలియం వార్డ్ గారు స్థాపించారు. ఇక్కడ ఆర్ట్స్, సైన్స్, కామర్స్ వంటి సాధారణ విద్యను అందించడమే కాకుండా, దేవుని సేవకులను సిద్ధం చేసే వేదాంత విద్యను (Theology) కూడా అత్యుత్తమంగా అందిస్తున్నారు. భారత దేశంలో వేదాంత విద్యలో అధికారిక డిగ్రీలు ప్రదానం చేసే అతి పురాతన సంస్థ ఇదే. ఈ కళాశాల ద్వారా సుమారు 3000 మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తూ, సమాజానికి మరియు సంఘాలకు ఉపయోగకరంగా మారుతున్నారు.

6 జనవరి

కీర్తనలు 38:1 – "యెహోవా, కోపోద్రేకము చేత నన్ను గద్దింపకుము. నీ ఉగ్రతచేత నన్ను శిక్షింపకుము."

1. యుద్ధ అనాథల దినోత్సవం: ఈరోజు 'ప్రపంచ యుద్ధ అనాథల దినోత్సవం'. యుద్ధాల కారణంగా కన్నతల్లిదండ్రులను కోల్పోయి, నిరాశ్రయులై, దిక్కులేని అనాథలుగా మిగిలిపోయిన లక్షలాది మంది అమాయక పిల్లల కొరకు ప్రార్థిద్దాం. వారు ఆకలి, దారిద్ర్యం, భయం, అభద్రతాభావం నుండి విడిపించబడాలని అడుగుదాం. దేవుని అపారమైన ప్రేమను, ఆశ్రయాన్ని వారు అనుభవించేలా, అలాగే సురక్షితమైన, సంతోషకరమైన భవిష్యత్తును పొందేలా దేవుని కృపను వేడుకుందాం.

2. హింసించబడుతున్న విశ్వాసుల కొరకు: 02 జనవరి 2025 నాడు ఛత్తీస్‌గఢ్, బస్తర్ జిల్లాలోని బడే బోడల్ గ్రామంలో కునికా కశ్యప్ అనే 25 ఏళ్ల క్రైస్తవ సహోదరి (ఆరు వారాల గర్భిణీ)పై గ్రామ పెద్దలు కఠినంగా దాడి చేయడంతో ఆమెకు గర్భస్రావం జరిగింది. ఈ దాడికి గురైన ఆ సహోదరికి దేవుడు సంపూర్ణమైన బలమైన విశ్వాసం, దైవికమైన ఓదార్పుదయచేయాలని ప్రార్థిద్దాం. అలాగే, క్రైస్తవులను హింసిస్తున్న వారి కాఠిన్య హృదయాలను దేవుడు మార్చి, వారికి నిజమైన మారుమనస్సు దయచేయాలని కన్నీటితో వేడుకుందాం.

3. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన : భారతదేశంలో బాలకార్మిక వ్యవస్థ ఒక భయంకరమైన సామాజిక జాడ్యంగా మారింది. సుమారు 1.01 కోటి మందికి పైగా పిల్లలు బడికి వెళ్లాల్సిన వయసులో ఇటుక బట్టీలు, టీ స్టాల్స్, తివాచీల నేత, మరియు అత్యంత ప్రమాదకరమైన కర్మాగారాల్లో బాలకార్మికులుగా తమ జీవితాలను గడుపుతున్నారు. ఈ అవమానకరమైన పద్ధతుల ద్వారా లక్షలాది కుటుంబాలు పరోక్షంగా పేదరికంలో మగ్గుతున్నాయి. బాల్యాన్ని, ఆరోగ్యవంతమైన చదువును కోల్పోయి శారీరక, మానసిక దోపిడీకి గురవుతున్న ఈ అభాగ్యులకు తక్షణ విముక్తి కలగాలని ప్రార్థిద్దాం. కఠిన చట్టాలు అమలు చేయబడి, ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య, రక్షణ దొరికేలా దేవుడు పాలకులకు, అధికారులకు జ్ఞానము దయచేయాలని వేడుకుందాం.

4. జనరల్ ఫిజీషియన్స్ సవాళ్లు : భారతదేశంలోని వైద్యులు విపరీతమైన పని గంటలు, ఆసుపత్రులలో రోగుల యొక్క తీవ్రమైన రద్దీ, తగినంత వైద్య సిబ్బంది లేదా సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం, మరియు తరచుగా రోగుల బంధువుల నుండి ఎదురయ్యే భౌతిక దాడులు, మానసిక ఒత్తిళ్లు వంటి కఠినమైన సవాళ్లను ప్రతిరోజూ తమ వృత్తిలో ఎదుర్కొంటున్నారు. ఈ వైద్యులకు దేవుడు మంచి ఆరోగ్యం, దైవిక రక్షణ, మరియు రోగులకు సరైన చికిత్స అందించే వివేచన అనుగ్రహించాలని, వారు ఆత్మీయంగా బలపడి తమ రోజువారీ వృత్తిని ఎంతో బాధ్యతాయుతంగా, దేవుని భయంతో నిర్వర్తించేలా సహాయం చేయాలని ప్రార్థిద్దాం. దెవుని దివెన వారి పని ప్రదెశాలలొ తొడుగా ఉండాలని వెడుకుందాం.

5. మీడియా రంగంలో నైతికత కొరకు : వినోద రంగంలోని సంగీత, ఆడియో స్ట్రీమింగ్ మాధ్యమాలలో యువతను ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకుని ప్రసారమయ్యే అశ్లీలమైన మరియు చెడు ప్రభావం చూపే కంటెంట్‌ను వెంటనే నివారించాలని ప్రార్థిద్దాం. ఈ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను నడిపించే అధికారులకు దేవుడు మంచి వివేచన దయచేయాలని వేడుకుందాం. టీనేజర్ల లేత మనస్సులను కలుషితం చేసే అనైతిక విషయాలను ఫిల్టర్ చేసి, వారికి ఉపయోగపడే ఆరోగ్యకరమైన సమాచారం మాత్రమే అందించేలా ఈ రంగంలో గొప్ప మార్పు రావాలని ప్రార్థిద్దాం.

7 జనవరి

కీర్తనలు 119:132 "నీ నీ నామమును ప్రేమించువారికి నీవు చేయదగునట్లు నాతట్టు తిరిగి నన్ను కరుణింపుము."

1. డైట్ రిజల్యూషన్ వీక్ (Diet Resolution Week) : ఈ ప్రత్యేకమైన వారం నూతన సంవత్సరంలో ప్రజలు తమ జీవనశైలిని మార్చుకొని, మంచి ఆరోగ్య అలవాట్లను, సరైన ఆహార నియమాలను అలవర్చుకోవడాన్ని ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం జరుపుకుంటారు. మన దేహము పరిశుద్ధాత్మకు ఆలయమని బైబిల్ చెబుతున్నందున, క్రైస్తవులు తమ ఆరోగ్య విషయంలో ఎంతో బాధ్యతగా మెదలాలి. సమాజంలో మంచి ఆరోగ్యం కోసం నూతన తీర్మానాలు చేసుకునే ప్రతి ఒక్కరికి దేవుని సహాయం దొరకాలని, అలాగే కనీస పోషకాహారం అందని పేదలకు దేవుడు మార్గాలు తెరవాలని మనము ప్రార్థనలో జ్ఞాపకం చేసుకుందాం.

2. జిల్లాల కొరకు ప్రార్థన : ఈరోజు తెలంగాణ లో ఉన్న ఆదిలాబాద్ మరియు కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాల కొరకు ప్రార్థిద్దాం. ఈ రెండు జిల్లాల ప్రధాన కేంద్రాలు వరుసగా ఆదిలాబాద్ మరియు ఆసిఫాబాద్. వీటి ఉమ్మడి జనాభా సుమారు 12 లక్షలు. అక్షరాస్యత సగటు 60% కాగా, క్రైస్తవ జనాభా కేవలం 1% కన్నా తక్కువే. ఇక్కడి మారుమూల అటవీ గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయాలు, ఉపాధి అవకాశాలు లేక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతంలో నూతన ఉపాధి అవకాశాలు మెరుగుపడాలని, గిరిజనులకు మౌలిక వసతులు అందాలని మరియు క్రీస్తు ప్రేమ వారిని చేరుకోవాలని ప్రార్థిద్దాం.

3. మహిళల ఆరోగ్య భద్రత (40-50 ఏళ్ల మహిళలు ఎదుర్కొనే శారీరక మార్పుల కోసం): 40-50 ఏళ్ల మధ్యవయస్కులు మెనోపాజ్ (హార్మోన్ల మార్పులు), తీవ్రమైన అలసట, ఎముకలు బలహీనపడటం మరియు హార్మోన్ల అసమతుల్యత వల్ల అనేక శారీరక ఇబ్బందులు ఎదుర్కొంటారు. తమ ఆరోగ్య సమస్యలను పక్కనబెట్టి కుటుంబ బాధ్యతల్లో నలిగిపోయే ఈ మహిళలకు మంచి ఆరోగ్యం, శారీరక బలం మరియు ఉపశమనం పొందాలని మనం ప్రత్యేకంగా ప్రార్థిద్దాం. దేవుడు వారిని బలపరచాలని కోరుకుందాం.

4. క్షయ వ్యాధి (TB) **బాధితుల కొరకు :** క్షయ వ్యాధి అనేది మైకోబాక్టీరియం వల్ల ఊపిరితిత్తులకు సోకే తీవ్రమైన అంటువ్యాధి (అన్ని వయసుల వారు, ముఖ్యంగా పెద్దలు దీని బారిన పడుతున్నారు). భారతదేశంలో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల్లో ఇది వేగంగా ప్రబలుతోంది. ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారం, ప్రపంచ TB కేసులలో దాదాపు 27% భారత్‌లోనే ఉంటున్నాయి. ఈ వ్యాధితో శారీరక క్షీణత, మానసిక వేదన ఎదుర్కొంటున్న లక్షలాది మంది ప్రజలకు దేవుని సంపూర్ణ స్వస్థత కలగాలని, తగిన ఉపశమనం దొరికి, వారికి నాణ్యమైన వైద్య సహాయం త్వరగా అందాలని మనం విజ్ఞాపన చేద్దాం.

5. క్రైస్తవ కుటుంబాలు : వివాహానికి ముందు సన్నద్ధత (Pre-marital Preparation) : భారతదేశంలో దాదాపు 24% కంటే ఎక్కువ మంది జంటలు ఎలాంటి వివాహ పూర్వ కౌన్సెలింగ్ లేదా అవగాహన లేకుండానే వివాహబంధంలోకి ప్రవేశించడం వల్ల తొలినాళ్లలోనే తీవ్రమైన మానసిక, వైవాహిక సర్దుబాటు సమస్యలను ఎదుర్కొంటున్నారు. దేవుని వాక్యానుసారమైన వివాహబంధ ప్రాముఖ్యతను యువత గ్రహించి, వివాహానికి ముందే ఆత్మీయ, మానసిక సిద్ధపాటు పొందేలా మరియు సంఘాలు ఈ విధమైన కౌన్సెలింగ్ అందించాలని ప్రార్థించాలి. యువతకు వివాహానికి ముందు సరైన అవగాహన, దేవుని జ్ఞానం కలగాలని ప్రార్థిద్దాం.

"క్రైస్తవుడికి ఉన్న అతి గొప్ప ఆధిక్యత మరియు అందుబాటులో ఉన్న అత్యంత విప్లవాత్మకమైన శక్తి ప్రార్థనే." బిల్ బ్రైట్

8 జనవరి

కీర్తనలు 70:5 "నేను శ్రమల పాలై దీనుడనైతిని దేవా, నన్ను రక్షించుటకు త్వరపడి రమ్ము నాకు సహాయము నీవే, నారక్షణకర్తవు నీవే యెహోవా, ఆలస్యము చేయకుమీ."

1. ప్రపంచ టైపింగ్ దినోత్సవం ఈ రోజు ప్రపంచ టైపింగ్ దినోత్సవం. నేటి డిజిటల్ యుగంలో సమాచార మార్పిడికి టైపింగ్ అత్యంత కీలకం. టెక్నాలజీ రంగంలో పనిచేస్తున్న వారు, దేవుని వాక్యాన్ని డిజిటల్ రూపంలోకి అనువదిస్తున్న వారు, సువార్తను ఆన్ లైన్ ద్వారా వేగంగా వ్యాపింపజేస్తున్న వారి నైపుణ్యాలు దేవుని నామ మహిమ కొరకు అద్భుతంగా వాడబడాలని ప్రార్థిద్దాం.

2. ఐరోపా సూక్ష్మ దేశాల కొరకు విజ్ఞాపన : ఈ రోజు మనం ఐరోపా ఖండంలోని చిన్న దేశాలైన అండోరా, మొనాకో మరియు శాన్ మారినో దేశాల కొరకు ప్రార్థిద్దాం. ఈ మూడు దేశాల జనాభా సుమారు లక్షా యాభై వేలు. ఇక్కడ రోమన్ క్యాథలిక్ క్రైస్తవులు అత్యధికంగా (80–90 శాతం) ఉన్నప్పటికీ, వాక్య సత్యం ఎరిగిన విశ్వాసులు అరుదు. ఈ సంపన్న దేశాల్లో భౌతిక ఆకర్షణలు, దైవభక్తి లేని జీవితం విస్తృతంగా ఉన్నాయి. యువత ఆధ్యాత్మికతకు పూర్తిగా దూరమవుతున్నారు. ఈ పరిస్థితులు, సవాళ్లు అక్కడ ఆత్మీయ ఎదుగుదలకు తీవ్ర ఆటంకంగా మారుతున్నాయి. సువార్త ప్రకటించడానికి మిషనరీల కొరత ఉంది. నాయకుల సుపరిపాలన, కుటుంబాల ఆత్మీయ క్షేమం, మత స్వేచ్ఛ మరియు నామకార్థ క్రైస్తవులలో నిజమైన ఉజ్జీవం రావాలని వేడుకుందాం.

3. స్మగ్లింగ్ మరియు కస్టమ్స్ నేరాల నివారణ భారతదేశంలో అక్రమ రవాణా (స్మగ్లింగ్), కస్టమ్స్ ఉల్లంఘనలు తీవ్రమవుతున్నాయి. ప్రభుత్వ ఎన్.సి.ఆర్.బి (NCRB) గణాంకాల ప్రకారం, ప్రతి ఏటా బంగారం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులు వేలల్లో నమోదవుతున్నాయి. ముఖ్యంగా కేరళ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ వంటి తీరప్రాంత, సరిహద్దు రాష్ట్రాల్లో ఇవి చాలా అధికం. విమానాశ్రయాలు, సముద్ర మార్గాల ద్వారా అధికారుల కళ్ళు గప్పి వస్తువులను తరలిస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను, యువతను దెబ్బతీసే ఈ నేరాలకు పాల్పడేవారిలో మారుమనస్సు రావాలని, నేరాలను అరికట్టే అధికారులకు దేవుడు జ్ఞానం, నిజాయితీ అనుగ్రహించాలని ప్రార్థిద్దాం.

4. మనుష్య భయం నుండి విడుదల భారతీయ క్రైస్తవుల్లో "బంధువులు ఏమనుకుంటారో", "సమాజంలో పరువు పోతుందేమో" అనే మనుష్య భయం స్పష్టంగా కనబడుతోంది. దేవుని వాక్యానికి విధేయత చూపడం కంటే లోక ఆచారాలకు ప్రాధాన్యత ఇవ్వడం పాపంగా మారుతోంది. దీనివల్ల ఆత్మీయ జీవితం నీరసించి, కుటుంబాలు దేవుని దీవెనలకు దూరమవుతున్నాయి. సంఘాల్లో కూడా దీనివల్ల ఆత్మీయత దెబ్బతింటోంది. ప్రతి విశ్వాసి లోకాన్ని కాకుండా దేవుని సంతోషపెట్టే మనస్సు కలిగి, ఈ భయం నుండి సంపూర్ణ విడుదల పొంది, వాక్యానికి మాత్రమే లోబడే ధైర్యం పొందాలని మనం ప్రార్థిద్దాం.

5. ఉద్దేశపూర్వక ఏకాంతం (ఆత్మీయ క్రమశిక్షణ) యేసుక్రీస్తు మాదిరిగా, పరధ్యానాల నుండి దూరంగా వెళ్లి దేవునితో సహవాసం చేయడానికి ఏకాంత సమయాన్ని కేటాయించడం చాలా అవసరం. నా వ్యక్తిగత ఆత్మీయ ప్రయాణంలో, సెల్‌ఫోన్‌లు, లోక పనుల ఒత్తిడిని పక్కనపెట్టి, దేవుని స్వరం వినడానికి నేను ప్రత్యేక సమయం కేటాయించాలి. నా దైనందిన జీవితంలో క్రీస్తుకు మంచి సాక్షిగా జీవించేలా, ఈ ఆత్మీయ క్రమశిక్షణలో నేను, మన సంఘం ఎదగాలని, తద్వారా దేవునితో ముఖాముఖి సహవాసంలో అద్భుతమైన ఆత్మీయ బలం పొందుకోవాలని ప్రార్థిద్దాం.

"ప్రార్థన అంటే మనిషి ఇష్టాన్ని భరలోకంలో జరిగేలా చేయడం కాదు; దేవుని చిత్తాన్ని భూమి మీద జరిగేలా చేయడమే."

– వారెన్ వెర్స్బి

9 జనవరి

కీర్తనలు 31:1 "యెహోవా, నీ శరణుజొచ్చియున్నాను. నన్నెన్నడును సిగ్గుపడనియ్యకుము. నీ నీతినిబట్టి నన్ను రక్షింపుము."

1. ప్రవాసీ భారతీయ దివస్ (NRI Day) : ఈ రోజు విదేశాల్లో స్థిరపడి, మన దేశ అభివృద్ధికి ఎంతో విశేషంగా తోడ్పడుతున్న ప్రవాస భారతీయులను గౌరవించే దినం. చదువు, ఉద్యోగాల కోసం స్వస్థలాలు వదిలి సుదూర ప్రాంతాలకు వెళ్లిన మన వారు తమ పనులలో దీవించబడాలని మనము ప్రార్థిద్దాం. దేవుని కృప వారికి తోడుగా ఉండి, వారు ఎక్కడున్నా దేవునికి సాక్షులుగా జీవించాలని, వారి కుటుంబాలకు దేవుడు రక్షణ, ఆరోగ్యం అనుగ్రహించాలని ప్రార్థిద్దాం.

2. ఉక్రెయిన్ మరియు రష్యా మధ్య యుద్ధం: ఉక్రెయిన్ మరియు రష్యా మధ్య జరుగుతున్న భయంకరమైన యుద్ధం గురించి ప్రార్థిద్దాం. 2014లో మొదలై, 2022లో పెద్ద యుద్ధంగా మారిన ఈ సమస్యకు ప్రధాన కారణం భూభాగం మరియు ఆధిపత్య పోరు. దీనివల్ల ఉక్రెయిన్ దేశ ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటివరకు దాదాపు 5 లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. దేవుడు ఈ భయంకరమైన యుద్ధాన్ని త్వరలోనే ఆపుచేసి, అక్కడ శాంతిని నెలకొల్పాలని ప్రార్థన చేద్దాం.

3. కూరగాయల వ్యాపారుల కొరకు : మన చుట్టుపక్కల ఉండి మనకు అనుదినం ఎంతో నమ్మకమైన సహాయకులుగా ఉంటున్న కూరగాయల దుకాణం నడుపుతున్న వారిని ఈరోజు ప్రత్యేకంగా ప్రార్థనలో జ్ఞాపకం చేసుకుందాం. ప్రతిరోజూ ఉదయాన్నే ఎంతో త్వరగా నిద్రలేచి, ఎండలోనూ వానలోనూ ఎంతో కష్టపడుతూ, మన కుటుంబాలకు అవసరమైన తాజా ఆహారాన్ని అందిస్తున్న వారి అలుపెరగని శ్రమను దేవుడు ఆశీర్వదించాలని ప్రార్థిద్దాం. దేవుడు వారి ఆర్థిక ఇబ్బందులు పూర్తిగా తొలగించి, వారి వ్యాపారాలను ఆశీర్వదించాలి. వారి కుటుంబాలకు, పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం, సంతోషం, సమాధానం మెండుగా దయచేసి వారిని వర్ధిల్లజేయాలని ప్రార్థిద్దాం.

4. నేవీ ఆఫీసర్స్ కొరకు : భారతదేశంలో నేవీ ఆఫీసర్లు నెలల తరబడి సముద్రంలో కుటుంబాలకు దూరంగా గడ పటం, అనూహ్యమైన వాతావరణ మార్పులు, సరిహద్దు ఉద్రిక్తతలు, విధుల్లో తీవ్రమైన పని ఒత్తిడి, నిద్రలేమి మరియు ఏకాంతం వంటి ఎన్నో కఠినమైన ఆచరణాత్మక, వ్యవస్థీకృత సవాళ్లను అనునిత్యం ఎదుర్కొంటారు. ఈ కష్టమైన విధుల్లో ఉన్నవారికి దేవుడు అపారమైన శారీరక బలం, వివేచన దయచేసి, భయంకరమైన సముద్ర అపాయాల నుండి వారిని సురక్షితంగా రక్షించాలని ప్రార్థిద్దాం. వారి ఆధ్యాత్మిక ఎదుగుదలకు, మానసిక ధైర్యానికి అనుకూలమైన వాతావరణం దొరకాలని, సవాళ్లను ధైర్యంగా జయించడానికి దేవుని శాంతి వారి హృదయాలను నింపాలని వేడుకుందాం.

5. భవిష్యత్తు తరాల కొరకు (సోషల్ మీడియా ఒత్తిడి) : జెనరేషన్ జెడ్, ఆల్ఫా, మరియు రాబోయే బీటా తరాల యువత సోషల్ మీడియాలో ఇతరుల అందమైన, కల్పిత జీవితాలను చూసి తమ నిజ జీవితాలతో పోల్చుకుని తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. దీనివల్ల వారు తీవ్రమైన నిరాశ, ఆత్మన్యూనత భావంతో తమ నిజమైన సంతోషాన్ని, చదువుపై ఏకాగ్రతను మరియు దేవునితో ఆత్మీయ సహవాసాన్ని పూర్తిగా కోల్పోతున్నారు. ఈ కృత్రిమమైన సోషల్ మీడియా వ్యసనం, మానసిక ఒత్తిడి నుండి మన యువత పూర్తిగా విడిపించబడాలని ప్రార్థిద్దాం. దేవుడు వారిని తన స్వరూపంలో ఎంత అద్భుతంగా, ప్రత్యేకంగా సృష్టించాడో వారు స్పష్టంగా గ్రహించి, ఆయన సత్య వాక్యంలోనే తమ నిజమైన గుర్తింపును, శాశ్వత విలువను కనుగొని ధైర్యంగా, పరిశుద్ధంగా జీవించేలా దేవుడు వారి మనస్సులకు ప్రశాంతతను దయచేయాలని ప్రార్థిద్దాం.

10 జనవరి

కీర్తనలు 88:2,15 "యెహోవ... నా ప్రార్థన నీ సన్నిధిని చేరును గాక నా మొఱ్ఱకు చెవి యొగ్గుము... బాల్యము నుండి నేను శ్రమపడినవాడనై మరణోన్ముఖుడనై యున్నాను; నీ భయములు నామీదికి రాగా నేను బహుగా కలతపడుచున్నాను."

1. విద్యుత్ పొదుపు దినోత్సవం (Cut Your Energy Costs Day) ఈరోజు ప్రపంచవ్యాప్తంగా 'కట్ యువర్ ఎనర్జీ కాస్ట్స్ డే' (విద్యుత్ పొదుపు దినము) గా గుర్తిస్తున్నారు. ఇంధన వనరు లను పొదుపుగా వాడుతూ, కరెంట్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడంపై అవగాహన పెంచే రోజు ఇది. ముఖ్యంగా పెరుగుతున్న ఖర్చులతో, ఆర్థిక సవాళ్ళతో సతమతమవుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలను దేవుడు ఆదుకోవాలని, ప్రతి ఒక్కరిలో బాధ్యతాయుతమైన పొదుపు హృదయాన్ని అనుగ్రహించి, గృహ అవసరాలను తీర్చాలని ప్రార్థిద్దాం.

2. నాగాలాండ్ బాప్టిస్ట్ చర్చ్ కౌన్సిల్ (NBCC) **పరిచర్య కొరకు** ఈ దినాన మన దేశంలో పరిచర్య చేయు చున్న 'నాగాలాండ్ బాప్టిస్ట్ చర్చ్ కౌన్సిల్' (NBCC) కొరకు ప్రార్థిద్దాం. 20 కి పైగా అసోసియేషన్లతో, సుమారు 1,700 కి పైగా సంఘాలతో, వేలాదిమంది దైవసేవకులతో ఈ సంస్థ ఈశాన్య భారతదేశంలో గొప్ప సువార్త పరిచర్య చేస్తోంది. అక్కడ సేవ చేస్తున్న సేవకులకు రక్షణ, ఆరోగ్యం, సంఘాల ఆత్మీయ ఎదుగుదల మరియు ఆర్థిక అవసరాలు తీర్చబడాలని ప్రార్థిద్దాం.

3. విధవరాండ్ర పరిచర్య (Widow Care Ministry) **కొరకు** మన సంఘము మరియు డినామినేషన్ ద్వారా జరిగిస్తున్న 'విధవరాండ్ర పరిచర్య'ను దేవుడు దీవించును గాక. సమాజంలో ఒంటరితనము, ఆర్థిక ఇబ్బందులు మరియు అనారోగ్య సవాళ్లు ఎదుర్కొంటున్న ప్రియ సహోదరీలకు ఈ పరిచర్య ద్వారా ఆదరణ, రక్షణ మరియు అవసరమైన సహాయం అందాలి. పరిచర్య అవసరతలు తీర్చబడి, వారు ఆత్మీయంగా బలపడేలా దేవుడు కృప చూపాలని ప్రార్థిద్దాం.

4. సంఘ నాయకుల కొరకు ప్రార్థన (Pray for Church Leaders) మన సంఘంలోని పెద్దలు, డీకన్లు మరియు పరిచర్య నాయకులకు దేవుడు దైవిక జ్ఞానాన్ని, వివేచనను అనుగ్రహింపబడులాగున, సంఘ బాధ్యతలను నమ్మకంగా నిర్వహించుటకు, సవాళ్లను ఎదుర్కొనుటకు వారికి ఆత్మ నడిపింపు అవసరం. నాయకులందరూ ఏకమనస్సుతో, క్రీస్తు ప్రేమతో సంఘాన్ని ఆత్మీయంగా ముందుకు నడిపించేందుకు కావలసిన కృపను, ఆరోగ్యాన్ని దేవుడు దయచేయాలని ప్రార్థిద్దాం.

5. వ్యక్తిగత ఆత్మీయ ఎదుగుదల కొరకు ప్రార్థన : నా ఆత్మీయ జీవితంలో, నేను ఇతరులను యేసు వలె ప్రేమిస్తున్నానా అని యోహాను 13:34-35 మరియు 1 కొరింథీ యులకు 13 లేఖనాల వెలుగులో నన్ను నేను పరీక్షించుకుంటున్నాను. నా హృదయంలో ఓర్పు, దయ ఉన్నాయా? లేదా అసూయ, స్వార్థం చోటు చేసుకుంటున్నాయా? నా మాటలలో, ప్రవర్తనలో క్రీస్తు ప్రేమ వ్యక్తమవ్వాలి. కేవలం నా వ్యక్తిగత జీవితంలోనే కాదు, నా కుటుంబంలోను మరియు నా సంఘంలోను ఈ దైవిక లక్షణాలు ప్రతిబింబించాలి. సమాజంలో మేము క్రీస్తు శిష్యులమని మమ్ములను చూసి ఇతరులు గుర్తించేలా, మా కుటుంబం మరియు సంఘం నిష్కపటమైన ప్రేమకు సాక్ష్యంగా నిలబడాలి. ఈ ప్రేమ స్వరూపాన్ని మాలో సంపూర్ణంగా పెంపొందించడానికి దేవుడు సహాయం చేయులాగున ప్రార్థిద్దాం.

"రహస్యంగా చేసే ప్రార్థనే ఆత్మీయ జీవితం అంతటికీ మూల (మూలం) మంటిది." - డేవిడ్ బ్రెయినార్డ్

31 డిసెంబర్

కీర్తనలు 103:1-2 నా ప్రాణమా, యెహోవాను సన్నుతించుము. నా అంతరంగముననున్న సమస్తమా, ఆయన పరిశుద్ధ నామమును సన్నుతించుము.... ఆయన చేసిన ఉపకారములలో దేనిని మరువకుము.

1. సంవత్సరం అంతా కాపాడిన దేవునికి కృతజ్ఞతలు : గడిచిన సంవత్సరం మొదటి దినము నుండి ఈ చివరిదినము వరకు మనకు ఆయుష్షును, ఆరోగ్యమును దయచేసి మనలను సజీవుల లెక్కలో కాపాడిన దేవునికి హృదయపూర్వక కృతజ్ఞతలు చెల్లిద్దాం. లోకంలో ఎదురైన అనేక రకాలైన ఉపద్రవాలు, భయంకరమైన ఆర్థిక అస్థిరత పరిస్థితులు, ఆపదలు, అలాగే తీవ్రమైన అనారోగ్య పరిస్థితులు వీటన్నిటి నుండి దేవుడు మనకు ఇచ్చిన అద్భుతమైన భద్రతను, ఆయన కాపుదలను బట్టి దేవుని నామాన్ని స్తుతిద్దాం. ఈ సంవత్సరంలో కొందరు తమ ఆత్మీయులను కోల్పోయిన వారికి ప్రభువు ఆదరణ దయచేయాలని, రానున్న నూతన సంవత్సరంలో నిరీక్షణతో నడిపింపబడాలని ప్రార్థిద్దాం.

2. మన కుటుంబం, సంఘములో ప్రభువు చేసిన కార్యాలు : గడిచిన ఈ కాలమంతయు మన కుటుంబంలో దేవుడు తన కృపచేత నూతనంగా చేసిన ప్రతి అద్భుత కార్యాన్ని బట్టి దేవుని స్తుతిద్దాం. దేవుడు మనకు వచ్చిన అనేక ఆపదలలో, ఇబ్బందులలో మనకు ఎంతో మంచి ఆధారాన్ని ఇచ్చి, తగిన సమయానికి సహాయం చేసిన ప్రతి విధానాన్ని బట్టి దేవునికి నిండు మనస్సుతో స్తోత్రాలు చెల్లిద్దాం. ఈ సంవత్సరంలో మన కుటుంబ సభ్యులు ఆత్మీయంగా, భౌతికంగా ఉన్నతంగా స్థిరపడిన విషయాలను బట్టి దేవునికి ప్రత్యేకంగా వందనాలు అర్పిద్దాం. మన సంఘాన్ని, సంఘకాపరి గారి కొరకు, అలాగే సంఘ సభ్యులందరి క్షేమము కొరకు దేవుడు చేసిన అద్భుతమైన కార్యాలను బట్టి మనం ఈ సంవత్సరంలో ప్రార్థిద్దాం. వారి జీవితంలో దేవుడు చేసిన గొప్ప మేలులను, సాక్ష్యాలను జ్ఞాపకం చేసుకుంటూ, సంఘంలో ఉన్న ప్రతి కుటుంబాన్ని దేవుడు ఆశీర్వదించిన కారణాలను తలంచుకుని, దేవునికి కృతజ్ఞతలు చెల్లిస్తూ ఆయన నామాన్ని ఘనపరుద్దాం.

3. మన దేశం, దేశ నాయకుల కొరకు : మన దేశం కొరకు దేవునికి వందనాలు చెల్లిస్తూ, మన దేశానికి దేవుడు ఇచ్చిన గొప్ప సంరక్షణను బట్టి స్తుతిద్దాం. దేశంలో ఎటువంటి దుష్ట ఉగ్రవాద దాడులు జరగకుండా ప్రభువు ఉంచిన అద్భుతమైన కాపుదలను బట్టి, మన దేశ నాయకుల క్షేమము కొరకు దేవునికి స్తుతులు చెల్లిద్దాం. దేవుడు ఈ సంవత్సరం అంతా మన దేశాన్ని సంరక్షించి, పోషించి, కాపాడి, అనేక భయంకర ఆర్థిక సంక్షోభాల నుండి, యుద్ధాల నుండి క్షేమంగా సంరక్షించిన కారణాలను బట్టి దేవునికి స్తుతులు చెల్లిద్దాం.

4. హింసించబడుతున్న సంఘం, విశ్వాసుల కొరకు : మన ఇరుగు పొరుగు వారు, అలాగే మన రాష్ట్రంలో, దేశంలో అనేకమంది విశ్వాసులు దేవునిపై ఉన్న స్థిరమైన విశ్వాసమును బట్టి కుల బహిష్కరణ పొంది, స్థానికంగా తీవ్ర సహాయ నిరాకరణ పొందుతున్నారు. ఈ సంవత్సరంలో అలాంటి కఠిన పరిస్థితులు ఎదుర్కొన్న వారి కొరకు, ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో తీవ్ర శ్రమలగుండా వెళ్తున్న దేవుని సేవకుల కొరకు ప్రార్థనలో జ్ఞాపకం చేసుకుందాం. వారు ఆత్మీయంగా స్థిరులై, కదలక, ఎల్లప్పుడూ ప్రభువు కార్యాభివృద్ధి యందు విశేష ఆసక్తి కలిగి ఉండేలా ప్రార్థిద్దాం.

5. ఈరోజు జరిగే సంవత్సరాంతపు కూడికల కొరకు : ఈరోజు ప్రపంచవ్యాప్తంగా అర్ధరాత్రి వరకు ఎంతో ఉత్సాహంగా జరిగే వాచ్‌నైట్ సర్వీసులు అన్నీ దేవునికి మహిమకరంగా, అత్యంత కృతజ్ఞతా భావంతో జరగాలని ప్రార్థిద్దాం. తాగుబోతు మైకంలో ఎక్కడ ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు ఎవరూ పాల్పడకుండా ఉండాలని, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా దేవుడు పరిరక్షణ దయచేయాలని అడుగుదాం. మన సంఘాలలో జరిగే ఆరాధనలన్నీ కేవలం ఆత్మీయంగా, దేవుని వాక్యానుసారంగా జరగాలని ప్రార్థన చేస్తూ దేవుని మహిమను, ప్రసన్నతను కోరుకుందాం.

నూతన సంవత్సర శుభాకాంక్షలతో .....

మీ వ్యక్తిగత, కుటుంబ జీవితంలో ప్రభువు చేసిన కార్యములు ....



384

దైనిక దైనిక ప్రార్థన సమాహారము

మోజెస్ బెన్నీ ఏర్చి కూర్చిన ప్రార్థన సమాహారము (Prayer Almanac) చూస్తే నిజంగా ఆశ్చర్యం వేసింది. ఇందులో మన ప్రార్థన పరిధి విపరీతంగా వ్యాకోచిస్తుంది, ప్రార్థన గుడారాల తాళ్ళు పొడవౌతాయి. ఈ కూర్పు నేను చూసిన క్రైస్తవ సాహిత్యమంతటిలో విశిష్టమైనది (Distinctive) విలక్షణమైనది Unique) అని నాకు తోస్తున్నది. రకరకాల అనుదిన ధ్యానమాలికలు ఎన్నో ఉన్నాయి గానీ ప్రార్థనాంశాల దర్పణం ఒక్కటి కూడా లేదు. ఆ మాటకొస్తే ఇలాటి ప్రార్థన సంచయం నాకు తెలిసి ఏ భాషలోనూ లేదు.

ఇందులో వెలయించిన అంశాలను బహు సమగ్రంగా ప్రోది చేశారు సంకలన కర్త. విస్తృత ప్రభావం చూపే అనేకానేక వర్ణనాంశాలు మనప్రార్థన గడియను పరిపుష్టం చేస్తాయి. జాతీయ అంతర్జాతీయ దినోత్సవాలు; అధికారులు, నాయకులు; బాలకార్మిక వ్యవస్థ; విద్యార్థుల సమస్యలు, వారి మధ్య సేవ, అందరి ఆరోగ్యం, అనాథలు; క్రైస్తవులు ఎదుర్కొంటున్న హింసలు; అన్ని డినామినేషన్ క్రైస్తవులు; దీనమనస్సు మొదలైన క్రైస్తవ సుగుణాలు; ప్రపంచదేశాలు, జనజాతులు; మనుషుల్లో సైకలాజికల్ పరిస్థితులు; కృత్రిమ మేధస్సు; మన దేశంలో విద్యాసంస్థలు; అన్నిరకాల వృత్తి నిపుణులు; కేన్సర్, కులం... ఒకటేమిటి మన మనో పరిధిలోకి వచ్చే అన్ని సంగతుల ప్రస్తావన ఇందులో ఉంది. దానియేలు దైనిక ప్రార్థన జీవితం గురించి మనం చదువుతాము. మనలో చాలామంది ఇలాటి క్రమానుగత ప్రార్థన సరళి పాటించడానికి ఈ పుస్తకమొక గని, మాగాణి. సాధారణంగా మనకు గుర్తుకురాని ప్రార్థన అంశాలు ఇందులో అనుదిన ప్రార్థన అంశాలుగా స్వీకరించి మన ప్రార్థన జీవితాన్ని సుసంపన్నం చేసుకోవచ్చు. **జోబ్ సుదర్శన్**, విజయవాడ

ప్రతి విశ్వాసి ప్రపంచం, ఖండం, దేశం, రాష్ట్రం, నగరం, పట్టణం, గ్రామం, సంఘం, కుటుంబం మరియు వ్యక్తిగత విషయాలపై దైవికమైన దర్శనాన్ని కలిగి ఉండి ప్రార్థన చేయాలి. ఈ భారాన్ని బట్టి వ్యక్తిగత, కుటుంబ, సంఘ, ఉపవాస, విజ్ఞాపన మరియు ఆత్మీయ పోరాట ప్రార్థనలు చేయవలసి ఉంటుంది. ఇట్టి శక్తివంతమైన ప్రార్థనలు చేయుటకు సహోదరుడు మోజెస్ బెన్ని గారు రచించిన 'ప్రార్థనా మార్గదర్శిని' పుస్తకం బహు ప్రయోజన కరంగా ఉంటుంది. ఈ అద్భుతమైన పుస్తకమును చదువుట ద్వారా నేను ఎంతో ఆత్మీయ ఆనందాన్ని పొందాను. క్రైస్తవ సోదరులకు, ప్రార్థనపరులందరికీ ఇది ఎంతో మేలు చేకూరుస్తుందని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.

సోదరి మొండితోక శాంతకుమారి, HITHA, హైదరాబాద్.



రెవ. గోవాడ మోజెస్ బెన్ని, B.Tech, B.D., M.Sc (Psy), M.Sc (Counselling and Family Therapy), DPGC, (D.Min.), కాకినాడలోని బెరాకా బ్లెస్సింగ్ చర్చ్ లో పాస్టర్‌గా దేవుని పరిచర్య చేస్తున్నారు. ఆయన తన యవ్వన వయస్సులో ప్రభువును సొంత రక్షకునిగా అంగీకరించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసిన తర్వాత, కాకినాడలోని జేఎన్టీయూ (JNTU) విశ్వవిద్యా లయంలో కొంతకాలం లెక్చరర్‌గా పనిచేసి, దేవుని పిలుపు మేరకు, యూనియన్ బిబ్లికల్ సెమినరీ(UBS, Pune)లో వేదాంత విద్యను అభ్యసించారు. ప్రస్తుతం ఆయన సహాయ సంఘకాపరిగా, యువతకు మరియు కుటుంబాలకు కౌన్సిలర్‌గా, వివిధ క్రైస్తవ కాన్ఫరెన్స్‌లలో స్పీకర్ గా మరియు ఫ్యామిలీ సెమినార్లలో రిసోర్స్ పర్సన్‌గా దేవుని చేత బహు బలంగా వాడబడుచున్నారు.

ప్రస్తుతం ఆయన తన తల్లిదండ్రులు బిషప్ డా॥ జి.జోసఫ్ బెన్నీ, శ్రీమతి వనజాక్షి బెన్నీ మరియు భార్య జ్యోతి నబీనా, కుమారుడు జాషువా బెన్నీ, కుమార్తె డోరియా గ్రేస్ లతో కలిసి కాకినాడలో నివసిస్తున్నారు.

Mobina Publications